

14న డిప్యూటీ సీఎం పవన్ రాక
పిఠాపురంలో పారిశ్రామిక పార్కుకు శంకుస్థాపన
హెలిప్యాడ్ పరిశీలించిన అధికారులు 7

స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

అధికారులు సమన్వయంతో పనిచేయాలి : కలెక్టర్ షాన్‌మోహన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్, పక్కన ఎస్పీ జేసీ


కలెక్టరేట్ (కాకినాడ), ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ పోలీసు పరేడ్ మైదానంలో ఈనెల 15న స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం ఆయన కలెక్టరేట్ హాలులో స్వాతంత్ర్య వేడుకల ఏర్పాట్లపై సమీక్షించారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారన్నారు. విద్యార్థులతో సాంస్కృతిక ప్రదర్శనలు, ప్రభుత్వ పథకాల శకటాల ప్రదర్శన, స్టాల్స్ ఏర్పాటుకు ముందుస్తు ఏర్పాట్లు చేయాలన్నారు. ఆయా శాఖల ప్రగతి నివేదికలను బుధవారంలోగా పంపించాలన్నారు. ఆయా శాఖల పరిధిలో అత్యుత్తమ సేవలు అందించిన వారి పేర్లను అవార్డులకు సిఫార్సు చేయాలన్నారు. అవార్డులకు గౌరవం పెరిగేలా ఉత్తమ పనితీరు కనబర్చిన వారిని మాత్రమే గుర్తించి వారి పేర్లను ఈనెల 7వ తేదీలోపు పంపించాలన్నారు. పోలీసు పరేడ్ మైదానంలో 15వ తేదీ ఉదయం 9 గంటల నుంచి జరిగే వేడుకలకు ప్రజలు, స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబీకులు, ఇతర ప్రముఖులు ఆహ్వానితులేనన్నారు. వేదిక, సీట్లు, సౌండ్ సిస్టం ఏర్పాటు చేయాలన్నారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ముందుగానే పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. అందరికీ సరిపడేలా తాగునీరు సమకూర్చాలన్నారు. పోలీసు, ఎన్‌సీసీ విభాగాల వారు గార్డ్ ఆఫ్ హానర్, పరేడ్ నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై దృష్టి పెట్టాలన్నారు. అతిథులు, సామాన్య ప్రజలు, విద్యార్థులు, చిన్నారులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలన్నారు. ఫైర్ సేఫ్టీ ప్రమాణాలు సరిచూసుకోవాలన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు భాగసాములవుతారని, ఈ మేరకు సిటింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో ఎస్పీ బిందుమాధవ్, జేసీ రాహుల్ మీనా పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

కలెక్టరేట్ (కాకినాడ), ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్లో జేసీ రాహుల్‌మీనాతో కలిసి గృహ నిర్మాణాలు, అన్న క్యాంటీన్లు, పీ4, పోస్టర్ అడాప్షన్, నవోదయం వంటి పథకాలపై సమీక్షించారు. గృహ నిర్మాణ శాఖ అధికారులు పనితీరు మెరుగుపర్చుకుంటూ గృహాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలన్నారు. అవసరమైనంత ఇసుక, సిమెంటు, ఇతర మెటీరియల్ జిల్లాలో పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నాయన్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరించాలన్నారు. వారం వారం లక్ష్యం నిర్దేశించుకుని తప్పనిసరిగా స్టేజ్ కన్వర్షన్ జరిగేలా చూడాలన్నారు. అన్న క్యాంటీన్లను తరచూ తనిఖీ చేసి పారిశుధ్యం, తాగునీరు, సమయానికి ఆహారం అందించడం వంటి అంశాలపై అధికారులు దృష్టి సారించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన పోస్టర్ అడాప్షన్ (తాత్కాలిక దత్తత)పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమం కింద రెండు సంవత్సరాల నుంచి 18 ఏళ్లలోపు పిల్లలను దత్తత ఇస్తారన్నారు. అలాగే వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఈనెల 12 నుంచి 20వ తేదీ వరకు పిల్లలందరికీ నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేయాలన్నారు. వైద్య-ఆరోగ్యం, అంగన్వాడీ, విద్య, ఇంటర్మీడియట్ శాఖల అధికారులతో సమన్వయంతో పనిచేయాలన్నారు. అక్రమంగా సారా, మద్యం తయారీని అరికట్టేందుకు నవోదయం కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ఆర్థిక అసమానతలను తొలగించే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన పీ4 కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలన్నారు. బంగారు కుటుంబాల దత్తతకు మార్గదర్శకులను గుర్తించాలన్నారు. డీఆర్వో వెంకట్రావు, జడ్పీ సీఈవో లక్ష్మణరావు, సీపీవో త్రినాథ్ పాల్గొన్నారు.



ముందడుగు!

బార్లకు లాటరీ..

వచ్చే నెల ఒకటి నుంచి కొత్త బార్‌లు

మద్యం బార్ల ఎంపికకు రాష్ట్ర ప్రభుత్వం నూతన పాలసీకి రూపకల్పన చేసింది. గత వైసీపీ ప్రభుత్వంలో 2022-25 మధ్య అమలైన మద్యం బార్‌ల పాలసీ గడువు ఆగస్టు 31వ తేదీతో ముగియనుంది. ఈ నేపథ్యంలో సెప్టెంబరు 1వ తేదీ నుంచి రాష్ట్రంలో కొత్త మద్యం బార్‌ల పాలసీ అమలుకు గ్రీన్‌సిగ్నల్ పడింది. ముందస్తుగా ఈ పాలసీ అమలుకు రాష్ట్రంలో మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించి ఆ ఉపసంఘం ఇచ్చిన అధ్యయన నివేదిక ఆధారంగా కొత్త బార్ల పాలసీ అమలుకు శ్రీకారం చుట్టనుంది.ఈ పాలసీలో భాగంగా గీత కార్మికులకు 10 శాతం షాపులు కేటాయించనున్నారు.

(రాజమహేంద్రవరం/ అమలాపురం -ఆంధ్రజ్యోతి)

కొత్త బార్ పాలసీపై అబ్కారీ శాఖ దాదాపుగా కసరత్తు పూర్తి చేసింది. త్వరలో కొత్త బార్‌లకు నోటిఫికేషన్ వెలువడనుంది. జగన్ హయాంలో ఇచ్చిన బార్‌ల లైసెన్స్‌లకు ఈ నెలాఖరుతో కాల పరిమితి ముగుస్తుంది. దీంతో ఈనెల 15వ తేదీలోగా కొత్త బార్‌లకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం కనిపిస్తోంది. సెప్టెంబరు 1 నుంచి కొత్త బార్‌లు అందుబాటులోకి రానున్నాయి. మద్యం దుకాణాల కేటాయింపులో గీతకార్మికులకు ప్రభుత్వం 10 శాతం షాపులు కేటాయించింది. వీరికి లైసెన్స్ ఫీజు సైతం భారీగా తగ్గించింది. త్వరలో బార్ల లైసెన్సుల్లోను పది శాతం కల్లుగీత కార్మికులకు ప్రభుత్వం కేటాయించింది.

దుకాణాల్లో ధరలకే

జగన్ హయాంలో బార్‌లలో ధరలను బార్లా తెరిచేశారు. అప్పటి ప్రభుత్వం ఇష్టానుసారం ధరలు పెంచుకోవచ్చని జీవో ఇవ్వడంతో అడ్డూ అదుపూ లేకుండా మందుబాబుల జేబులను గుల్ల చేశారు. వైసీపీ ప్రభుత్వం ఒకవైపు మద్యం ధరలను నూరుశాతం పెంచగా, బార్‌లలో దానిపై మరింత అదనంగా లాగేశారు. క్వార్టరుకు రూ.50-రూ.70, బీర్‌కి ఏకంగా రూ.100-రూ.120 తీసుకుంటూ దోపిడీ చేశారు. ఐదేళ్లు ఈ దందా సాగింది.ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఆ దోపిడీకి కొత్త మద్యం పాలసీతో అడ్డుకట్ట వేసింది. బార్‌లలో కూడా దుకాణాల్లో ధరలనే అమలుచేయాలని నిర్ణయానికి వచ్చింది. దుకాణాల కంటే 10 శాతం ఎక్కువ ధర చెల్లించి బార్‌లు ప్రభుత్వ మద్యం డిపోల నుంచి కొనుగోలు చేస్తాయి.బార్‌లలో కూడా దుకాణాల ధరే నిర్ధారిస్తే ఆ శాతాన్ని ప్రభుత్వం నష్టపోవాల్సి ఉంటుంది. దరఖాస్తు రుసుం రూ.5 లక్షలు ఉంటుందని చెబుతున్నారు.

పర్మిట్ రూంలు కూడా

జగన్ జమానాలో పిచ్చి బ్రాండ్లతో ఎంత ఆదాయం వచ్చిందో.. ఇప్పుడు దాదాపు 200 రకాల నాణ్యమైన బ్రాండ్లు ఉన్నా అంతే రాబడి నమోదవుతోంది. బీర్లలో పెరుగుదల కనిపిస్తే ఆ మేరకు మిగతా మద్యం బ్రాండ్లలో తరుగుదల నమోదవుతోంది.దీంతో ఆదాయం ఆశాజనకంగా ఉండడం లేదు. దీనిపై ప్రభుత్వం విశ్లేషణ చేయగా పర్మిట్ రూమ్‌లు లేకపోవడమే ఒక కారణమని తేలింది. ప్రస్తుతానికి అనధికారిక సిట్టింగ్‌లను చూసీచూడనట్టు వదిలేస్తున్నా.. ఆదాయం మెరుగుపడడం లేదు.బార్‌ల లైసెన్స్‌ల మాదిరిగానే పర్మిట్ రూంలకు ఈ సెప్టెంబరు నుంచి అనుమతులిచ్చే యోచనలో ప్రభుత్వం ఉంది.ఉమ్మడి జిల్లాలో 452 మద్యం దుకాణాలు ఉన్నాయి. 2019కి ముందు అన్ని షాపులకు ఏడాదికి రూ.5 లక్షలు ఫీజుగా ఉండేది. ఇప్పుడు దానిని రెండు కేటగిరీలుగా చేయనున్నారు.మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ.7.5 లక్షలు, మిగతా ప్రాంతాల్లో రూ.5 లక్షల ఫీజు విధించే అవకాశం ఉంది. ఉమ్మడి తూర్పులో కాకినాడ, రాజమహేంద్రవరం కార్పొరేషన్లు కాగా.. మిగతావి మునిసిపాలిటీలు, నగర పంచాయతీలు ఉన్నాయి. బార్‌లు, పర్మిట్ రూంలకు ఒకేసారి నోటిఫికేషన్ ఇస్తారా? లేదా వేర్వేరుగా విడుదల చేస్తారా? అనేది తెలియాల్సి ఉంది.

బార్లకు లాటరీ..

మద్యం షాపుల తరహాలోనే బార్లకు లాటరీ తీయాలని ప్రభుత్వం యోచిస్తోంది. జగన్ హయాంలో వేలం విధానంలో రెండేళ్ల పరిమితికి జారీ చేసిన లైసెన్స్‌లను గడువు ఈ నెల 31వ తేదీతో ముగుస్తోంది. ఈ నేపథ్యంలో కొత్త బార్లకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. లైసెన్స్ ఫీజుల నిమిత్తం రెండు ప్రతిపాదనలను ఎక్సైజ్ శాఖ సిద్ధం చేసింది. నగర పంచాయతీల్లో రూ.35 లక్షలు, మునిసిపాలిటీల్లో రూ.40 లక్షలు, నగరపాలక సంస్థల పరిధిలో రూ.45 లక్షలు మొదలు ప్రతిపాదన కాగా.. వరుసగా రూ.55 లక్షలు, రూ.65 లక్షలు, రూ.75 లక్షలు రెండో ప్రతిపాదనగా ప్రభుత్వం ముందుంచింది. అయితే ఖచ్చితంగా ఒక్కొక్క బారుకు నాలుగు దరఖాస్తులు పడాల్సిందేనన్న నిబంధన ఉంది. ప్రభుత్వం మొదటి ప్రతిపాదనకు మొగ్గు చూపుతుండగా ఆదాయం తగ్గుతుండడంతో ఏంచేయాలో ప్రశ్నార్థకంగా మారింది.ఆ అంతరాన్ని పూడ్చడానికి బార్‌ల సంఖ్య పెంచాలని భావిస్తున్నారు.ప్రస్తుతం తూర్పుగోదావరిలో 20, కాకినాడ జిల్లాలో 13, కోనసీమ జిల్లాలో 10 కలిపి మొత్తంగా 43 బార్లు ఉన్నాయి.ఈ సంఖ్య 60కి పెరిగే అవకాశం ఉంది.

- లాటరీ విధానంలో కేటాయింపు
- 10 రోజుల్లో నోటిఫికేషన్ విడుదల
- ఉమ్మడి జిల్లాలో 60 బార్లు
- దరఖాస్తు ఫీజు రూ.5 లక్షలు?
- బారుకు 4 దరఖాస్తులు తప్పనిసరి
- లైసెన్స్ ఫీజు రూ.45 లక్షలు
- మంత్రివర్గ ఉపసంఘం సిఫార్సులు
- పర్మిట్ రూంలకు అవకాశం
- ఈ నెల 31తో బార్ల గడువు ముగింపు

నాడంతా 'బార్లా'

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర ప్రభుత్వం త్వరలో బార్ లైసెన్సుల జారీకి సిద్ధమవుతోంది. బహిరంగ వేలం ద్వారా కోట్లలో ఆదాయం వచ్చే ఛాన్స్ ఉన్నా అదేదీ కాదనుకుని లాటరీ ద్వారా బార్ల జారీకి సన్నాహాలు చేస్తోంది. అయితే గత వైసీపీ ప్రభుత్వం బార్ల కేటాయింపులో అడ్డగోలుగా వ్యవహరించింది. భారీ అప్‌సెట్ ధరలను నిర్ణయించి వ్యాపారుల మధ్య పోటీ పెంచింది. అదే సమయంలో అప్పటి అధికార పార్టీ నేతలు ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టేశారు. బార్ల వ్యాపారులను సిండికేట్ చేసి వారి నుంచి తక్కువ ధరకు కోట్ చేయించి తద్వారా వారి నుంచి లాగేశారు. తద్వారా పోటీ లేకుండా తక్కువ ధరకే వైసీపీ అనుకూల వ్యాపారులు 2022 నుంచీ బార్లు నిర్వహిస్తూ భారీగా సంపాదిస్తున్నారు. గతంలో ఒక్కో బార్‌కు ప్రభుత్వం రూ.35 లక్షల ప్రారంభ ధర నిర్ణయిస్తే ఏరియా ఆధారంగా వేలంలో రూ.కోటికిపైగా పలకాల్సింది. కానీ నేతలు, వ్యాపారులు సిండికేట్ అయి అప్‌సెట్ ధరకు పది శాతం కూడా అదనంగా రాకుండా చేసి ఉమ్మడి జిల్లాలో అప్పటి వైసీపీ ప్రజాప్రతినిధులు భారీగా సంపాదించారు. ఒక్క కాకినాడ జిల్లాలో 15 బార్లకు వేలం నిర్వహించారు. ఒక్క కాకినాడ కార్పొరేషన్ పరిధిలో 11 బార్‌లను తక్కువ ధరకు లాగేసుకున్నారు. పోటీ పెరగకుండా ఉండేందుకు పదకొండు బార్‌లకు పద్దెనిమంది బరిలో ఉంటే అప్పటి సీటీ ఎమ్మెల్యే ద్వారంపూడి ఏడుగురిని దారికి తెచ్చారు. వేలం నుంచి పోటీదారులను తప్పించి ఒక్కో బార్‌కు రూ.35 లక్షల ప్రారంభ ధరగా ప్రభుత్వం నిర్ణయిస్తే కేవలం రెండు లక్షలే అదనంగా వేసి రూ.37 లక్షలకు కోట్ చేశారు. తద్వారా భారీగా ప్రభుత్వ ఆదాయానికి గండి పడింది.


కాకినాడలోని ట్రాన్స్‌కో డీఈ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

స్మార్ట్ మీటర్ల బిగింపు తక్షణం ఆపాలి

- విద్యుత్ చార్జీల భారాలు రద్దు చేయాలి
- ప్రజావేదిక ఆధ్వర్యంలో ధర్నా

కాకినాడసిటీ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై వివిధ రూపాల్లో విధిస్తున్న విద్యుత్ చార్జీల భారాలు రద్దు చేయాలని, ఇళ్లకు స్మార్ట్ మీటర్ల బిగింపు తక్షణం ఆపాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ప్రజా వేదిక ఆధ్వర్యంలో కాకినాడ ట్రాన్స్‌కో డీఈ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు జె.వెంకటేశ్వర్లు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ రాజ్‌కుమార్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, రైతు కూలీ సంఘం నాయకుడు బొచ్చా ఏసు మాట్లాడారు. అనంతరం విద్యుత్ శాఖ కమర్షియల్ అసిస్టెంట్ ఇంజనీర్ ప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు గుబ్బల ఆదినారాయణ, పెన్షనర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సత్తిరాజు, సీఐటీయూ నాయకుడు దువ్వా శేషుబాబ్జీ, మలక వెంకటరమణ, మేడిశెట్టి వెంకట రమణ, పలివెల వీరబాబు, బంగారు సత్యనారాయణ, ప్రసాద్, భూలక్ష్మి పాల్గొన్నారు.

పీ4 అమలుపై అమరావతి నుంచి సీఎం వీడియో కాన్ఫరెన్స్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ షాన్‌మోహన్, ఎమ్మెల్యే కొండబాబు

కలెక్టరేట్ (కాకినాడ), ఆగస్టు5(ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలన లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జీరో పావర్టీ పీ4 అమలులో భాగంగా మంగళవారం అమరావతిలోని సచివాలయం నుంచి సీఎం చంద్రబాబునాయుడు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కలెక్టరేట్ నుంచి కలెక్టర్ షాన్‌మోహన్, సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేందుకు మార్గదర్శకులను ప్రోత్సహించాలన్నారు. దత్తత ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. జడ్పీ సీఈవో లక్ష్మణరావు, సీపీవో త్రినాథ్ పాల్గొన్నారు.

ఎన్ఎంఆర్ లేబరుకు వేతనాల నిర్ణయం : కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్ఎంఆర్ (నామినల్ మస్టర్ రోల్) లేబరుగా పనిచేస్తున్న వారికి 2025-26 ఆర్థిక సంవత్సరానికి వేతనం నిర్ణయించినట్టు కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. మంగళవారం ఆయన ఒక ప్రకటన వెలువరించారు. వేతన కమిటీ సూచనలు, ధరలు పట్టిక, కొనుగోలు శక్తిలననుసరించి ఎన్ఎంఆర్ వర్కర్ల వేతనం నిర్ణయించామన్నారు. స్కిల్డ్ కేటగిరీ వర్కర్లకు రోజుకు రూ.746, సెమి స్కిల్డ్ కేటగిరీ వర్కర్లకు రోజుకు రూ.545, అన్ స్కిల్డ్ కేటగిరీ వర్కర్లకు రోజుకు రూ.444 చొప్పున నిర్ణయించామని కలెక్టర్ తెలిపారు.

పిల్లలు నులి పురుగు నివారణ మాత్రలు తీసుకోవాలి : కలెక్టర్

కలెక్టరేట్ (కాకినాడ), ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఒకటి నుంచి 19 ఏళ్లలోపు పిల్లలు, విద్యార్థులు విధిగా నులి పురుగు నివారణ మాత్రలు తీసుకోవాలని కలెక్టర్ షాన్ మోహన్ ఆదేశించారు. కలెక్టరేట్లో మంగళవారం జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమంపై సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. గోడ పత్రిక, కరపత్రాలు ఆవిష్కరించారు. కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ పిల్లలను రక్తహీనత నుంచి కాపాడటానికి ఈ మాత్రలను అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు, వసతి గృహాలు, డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలల్లో ఉచితంగా ఇస్తారన్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహ నాయక్ మాట్లాడుతూ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, కళాశాలల్లో గోడ పత్రికలను ప్రదర్శించి అవగాహన కల్పిస్తామన్నారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం రోజున హాజరుకాని పిల్లలకు ఈనెల 20న అల్బెండాజోల్ మాత్రలు పంపిణీ చేస్తామన్నారు. జేసీ రాహుల్ మీనా, జడ్పీ సీఈవో అరుణ, జిల్లా ప్రోగ్రాం అధికారి ప్రభాకర్, సుబ్బరాజు పాల్గొన్నారు.


ర్యాలీలో పాల్గొన్న అభ్యర్థులు

కాకినాడలో ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

జెండా ఊపి ప్రారంభించిన కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

7
ఉత్కంఠభరితంగా..
కాకినాడలో ఐదో రోజు జాతీయ మహిళా జూనియర్ హాకీ పోటీలు



లెక్క.. తప్పింది!

- కాకినాడలో ఆడిట్‌పై అనుమానాలు
- 248 అభ్యంతరాల తొలగింపు
- రూ.79.92 కోట్లు మళ్లింపు
- కమీషన్ల కోసం అవినీతికి తెర

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): అవినీతి చేయాలనే ఆలోచనకు ఆడిటర్లు సహకరిస్తే వచ్చే కిక్కే వేరు.. ఇలాంటి వాటికి కాకినాడ నగరపాలక సంస్థ సరిగ్గా సరిపోతుందనిపిస్తుంది. 2008-09 నుంచి 2018-19 వరకు జరిగిన ఆడిట్ వివరాలే ఇందుకు సాక్ష్యం. తప్పు అని చెప్పి ఆ తర్వాత కాదు అని తేల్చడం ఆడిట్ అధికారులకే చెల్లుతుంది. ఎక్కడైనా ఎప్పుడైనా ఆడిట్ జరిగితే కొన్ని లోపాలు పట్టుకుంటారు. అలా అభ్యంతరాలు చెప్పినప్పుడు కొన్నింటికి సదరు లోపాలకు సంబంధించి పేపర్లు సమర్పిస్తే ఆ అభ్యంతరాలను తొలగించవచ్చు. కానీ అది చాలా తక్కువ శాతం ఉంటుంది. కానీ నగరపాలక సంస్థ అభ్యంతరాల తొలగింపు చాలా అనుమానాలకు తావిస్తోంది. కేవలం నిధుల స్వాహా కోసమే అభ్యంతరాల తొలగింపు జరిగినట్టు కనిపిస్తోంది. డ్రాపింగ్ మేళా కార్పొరేషన్ ఆడిట్ అధికారులకు ఆశ్చర్యం కలిగిస్తోంది. కార్పొరేషన్‌లో ఏకంగా 248 అభ్యంతరాలను తొలగించారు. సుమారు రూ.79,92,27,631కు సంబంధించి నిధులు ఆడిట్ అభ్యంతరాల నుంచి బయటపడ్డాయి. ఇంత పెద్ద మొత్తం నిధులకు మోక్షం కల్పించడం చాలా అనుమానాలకు తావిస్తోంది. 2008-09 నుంచి 2018-19 వరకు తొలగిస్తూ అమరావతి సీడీఎంఏ ఆడిట్ అధికారి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో కాకినాడ కార్పొరేషన్‌లో 248 అభ్యంతరాలను ఒకేసారి తొలగించేశారు. అనేక సంవత్సరాలుగా ఆడిట్ విభాగం అడిగిన వివరాలను గతంలో ఇవ్వకుండా 2020 వైసీపీ ప్రభుత్వంలో ఒకేసారి ఇవ్వడం కూడా పలు అనుమానాలకు తావిస్తోంది. ఆస్తి పన్ను, ఇంజనీరింగ్ విభాగం వంటి ఆదాయానికి సంబంధించిన వివరాలు ఇవ్వకపోవడంతో గతంలో ఈ అభ్యంతరాలను లేవనెత్తారు. వీటన్నింటికీ రికార్డులు పరిశీలిస్తున్నారా? లేదా? అనేది కూడా ప్రశ్నార్థకంగా మారింది. గతంలో ఇటువంటి అభ్యంతరాలను తొలగించేందుకు ప్రత్యేకంగా టీమ్‌లు ఏర్పాటు చేసేవారు. అటు వంటిది జిల్లా నుంచి మొక్కుబడిగా ఒకరిద్దరు వచ్చి అభ్యంతరాలు తొలగిస్తూ నిర్ణయాలు తీసుకోవడం కూడా పలు అనుమానాలు రేకెత్తిస్తోంది. పెద్ద మొత్తంలో ఆడిట్ అభ్యంతరాలు తొలగింపునకు సొమ్ములు చేతులు మారాయనే ఆరోపణలు ఉన్నాయి.

ఆడిట్‌లో అభ్యంతరాలు..

ప్రస్తుతం నగరపాలక సంస్థలో 1967-68 నుంచి 2023-24 వరకు 2,829 అభ్యంతరాలకు రూ.817,57,11,879 ఆడిట్ అభ్యంతరాలు ఉన్నాయి. చేసిన పనులకు, ఖర్చుపెట్టిన డబ్బులకు ఎటువంటి ఎం.బుక్‌లు, బిల్లులు, రికార్డు చూపించకపోవడంతో నిధులు పూర్తిగా దుర్వినియోగం అవుతున్నాయన్న విషయం తేటతెల్లమవుతోంది. చిత్రగుప్తుడి పుస్తకంలో పాపాలు పేరుకుపోయినట్లు ఈ ఆడిట్‌లో అభ్యంతరాలు పేరుకుపోతున్నాయి. వీటిపై అధికారులు ఎటువంటి చర్యలూ చేపట్టకపోవడంతో కోట్ల రూపాయలకు జవాబుదారీతనం లేకుండా పోతోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇంజనీరింగ్ అధికారులే కాంట్రాక్టర్ల అవతారమెత్తి పనులు చేసి ఎటువంటి ఎం.బుక్‌లు, రికార్డులు చూపించకుండానే సొమ్ములు కాజేశారనే ఆరోపణలున్నాయి. కాబట్టి అటువంటి ఆడిటర్ అభ్యంతరాలపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని పలువురు కోరుతున్నారు.

స్పందించని అధికారులు

కాకినాడ నగరపాలక సంస్థకు సంబంధించి అభ్యంతరాల తొలగింపుపై ఆడిట్ అధికారులను వివరణ కోరగా... కార్పొరేషన్‌పై వచ్చిన ఆడిట్ అభ్యంతరాలను జిల్లా అధికారి ఆధ్వర్యంలో తొలగిస్తామని, తమకు ఎలాంటి సంబంధం లేదని చెప్పారు. రూ.79,92,27,631కుగాను 248 ఆడిట్ అభ్యంతరాలను తొలగించిన విషయం వాస్తవమేనని అధికారులు ఒప్పుకుంటున్నప్పటికీ వివరణ ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారు.

కొన్ని ఉదాహరణలు...

- 2013-14 కోడ్ నెం.7, పారా నెం.9(1) సమాచారం ప్రకారం ప్రాపర్టీ ట్యాక్స్, యాడ్స్ ట్యాక్స్, వాటర్ చార్జెస్, మార్కెట్లు ఆశీలు, షాపులు అద్దె బకాయిలు, పబ్లిక్ హెల్త్ ట్రేడ్ లైసెన్సులు వంటివన్నీ కలిపి రూ.35,23,35,384కు సంబంధించి ఆడిటర్ అభ్యంతరాలు తొలగించారు.
- 2014-15 కోడ్ నెం.7, పారా నెం.11 (1) సమాచారం ప్రకారం హౌస్ ట్యాక్స్ పెండింగ్ రూ.34,12,34,205 ఆడిట్ అభ్యంతరాల నుంచి తొలగించారు.
- 2014-15 కోడ్ నెం.4, పారా నెం.9(2) సమాచారం ప్రకారం రూ.1,53,64,467కు సంబంధించి తొలగించారు.
- 2014-15 కోడ్ నెం.8, పారా నెం.12(2) సమాచారం ప్రకారం రూ.85,10,304, 2015-16 కోడ్ నెం.8, పారా నెం.11(1) సమాచారం ప్రకారం రూ.65,94,849, 2016-17 కోడ్ నెం.8, పారా నెం.20 సమాచారం ప్రకారం రూ.80,48,274, 2017-18 కోడ్ నెం.8, పారా నెం.39 సమాచారం ప్రకారం రూ.1,29,11,779 ఆడిటర్ అభ్యంతరాల నుంచి తొలగించారు.




ఫసల్ బీమాతో...
రైతులకు ధీమా

రూ.76 ప్రీమియం చెల్లిస్తే రూ.38వేలు బీమా... ఈ నెల 15 వరకు గడువు

అమలాపురం రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై) రైతు నష్ట నివారణకు దోహద పడుతుంది. ఆరుగాలం కష్టించి పండించిన పంట చేతికి అందేవరకు అన్నదాతలకు ఆందోళన తప్పట్లేదు. ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో రైతులకు అండగా నిలిచేందుకు కేంద్ర ప్రభుత్వం ఫసల్ బీమా యోజన పథకం అమలు చేస్తోంది. ప్రకృతి వైపరీత్యాలు, చీడపీడలతో పంటకు నష్టం వాటిల్లితే రైతులకు ఆర్థిక ఇబ్బంది లేకుండా బీమా వర్తించేలా ఈ పథకాన్ని రూపొందించినట్టు వ్యవసాయ శాఖ అమలాపురం డివిజన్ సహాయ సంచాలకుడు కెనడీ, మండల వ్యవసాయాధికారి కె.ప్రవీణ్ తెలిపారు. వరి పంటకు సంబంధించి బీమా ప్రీమియం చెల్లించేందుకు ఈ నెల 15వ తేదీ వరకు గడువు ఉన్నందున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రూ.76 ప్రీమియం చెల్లిస్తే చాలు..

- ~~ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో రైతులు పీఎంఎఫ్~~ బీవై పథకం కింద రూ.76 ప్రీమియంగా చెల్లిస్తే రూ.38వేలు బీమా వర్తిస్తుంది.
- పంట ముంపు బారిన, చీడపీడల బారిన పడ్డా, తుఫాన్లు వంటి ప్రకృతి విపత్తులతో పంట నష్టపోయినా ఫసల్ బీమా వర్తిస్తుంది.
- పంటకోసి పనలపై ఉన్నప్పుడు అకాల వర్షాలు, వరదలు, తుఫాన్లు కారణంగా పంట దెబ్బతిన్నా బీమా వర్తింపజేస్తారు.
- పంట ముంపు బారిన పడితే 48 గంటల్లోగా సంబంధిత బ్యాంకులతో పాటు వ్యవసాయ అధికారులకు సమాచారం అందించాలి.
- గ్రామం యూనిట్‌గా నష్టాన్ని అంచనా వేసి పరిహారం చెల్లిస్తారు.
- బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్న రైతులకు బ్యాంకులే ప్రీమియం చెల్లించి బీమాను వర్తింపచేస్తాయి.
- రుణం తీసుకోని రైతులు సమీపంలోని కామన్ సర్వీస్ సెంటర్, పోస్టాఫీసు ద్వారా ప్రీమియం చెల్లించి రసీదు పొందవచ్చు.
- ఇందుకోసం హెల్ప్ లైన్ నెంబరును ప్రకటించారు. టోల్‌ఫ్రీ నెంబరు 1800-209-3536, ఎన్‌సీఐపీ హెల్ప్‌లైన్ నెంబరు 14447కు సమాచారం అందించి వివరాలు తెలుసుకోవచ్చు.



నవీకరణలో తపాల శాఖ మరో మైలురాయి చేరుకుంది. కంప్యూటర్ అనుసంధానం, డిజిటలైజేషన్, ఇండియన్ పోస్ట్ పేమెంట్‌తో ముందుకు సాగుతుండగా తాజాగా మరో అడుగు ముందుకు వేసింది. సొంతంగా ఎ.పి.టి 2.0 (అడ్వాన్స్‌డ్ పోస్టల్ అండ్ ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ)ని రూపొందించుకుంది. ఇప్పటికే పలు రాష్ట్రాల్లో ప్రయోగాత్మకంగా ప్రారంభించగా సత్ఫలితాలు రావడంతో దేశవ్యాప్తంగా అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా అన్ని పోస్టాఫీసుల్లోనూ ఆధునికీకరణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి.



పోస్టల్ సేవలు...
ఇంటి నుంచే!

(అమలాపురం టౌన్/మండపేట-ఆంధ్రజ్యోతి)

భారతీయ తపాలా శాఖ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని సేవలను మరింత విస్తృతం చేసింది. ఇంటి వద్ద నుంచే పోస్టల్ సేవలు పొందే అవకాశం కల్పించింది. ఇప్పటికే గ్రామీణ స్థాయిలో బ్యాంకింగ్ రంగంలో దూసుకుపోతోంది. ఇకపై ప్రఖ్యాత డోర్ డెలివరీ సంస్థలు అయిన ప్రైవేటు ఈ-కామర్స్‌తో పోటీపడుతూ తక్కువ ఖర్చుతో తక్కువ సమయంలో డోర్ డెలివరీకి శ్రీకారం చుట్టింది.

తపాలా శాఖ న్యూ జనరేషన్ టెక్నాలజీ సాఫ్ట్‌వేర్ పోస్టల్ సేవలను ఖాతాదారులకు అందుబాటులోకి తెచ్చింది. అడ్వాన్స్‌డ్ పోస్టల్ టెక్నాలజీ (ఏపీటీ-2.0) సేవలను జిల్లాలోని అన్ని తపాలా కార్యాలయాలకు అనుసంధానం చేశారు. ప్రస్తుతం తపాలా సేవలన్నీ నూరు శాతం వెబ్ ఆధారిత క్లౌడ్ టెక్నాలజీతో అనుసంధానం చేశారు. ఏపీటీ 2.0 విధానంలో అత్యాధునికంగా జరుగుతున్న సైబర్ నేరాలను నియంత్రించడంతో పాటు వాటిపై ఎప్పుడూ నిఘా కొనసాగుతూనే ఉంటుంది.

ఐఎంఏ యాప్‌ను డౌన్లోడ్ చేసుకుంటే చాలు..

వినియోగదారులు, ఖాతాదారులు ఏపీటీ సేవలు పొందేందుకు మొబైల్ ఫోన్‌లో గూగుల్ ప్లేస్టోర్ నుంచి ఐఎంఏ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుంటే చాలు. వెంటనే ఐడీ నెంబరు వస్తుంది. ఆ నెంబరు ద్వారా రిజిస్టర్ పోస్టు, స్పీడ్ పోస్టు తదితర తపాలా సేవలను ఇంటి నుంచే పొందవచ్చు. పోస్టు చేయదలచిన పార్శిల్ అంచనా బరువు, సమీప పోస్టాఫీసు వివరాలను ఐఎంఏ యాప్‌లో నమోదు చేస్తే సంబంధిత ప్రాంత పోస్టుమన్ ఇంటి వద్దకే వచ్చి పార్శిల్ తీసుకెళ్తాడు. బరువు ఆధారంగా చార్జీలు ఉంటాయి. సంబంధిత చార్జీలను వినియోగదారులు నగదు, యూపీఐ ద్వారా చెల్లించవచ్చు. ఐఎంఏ యాప్ ద్వారా ఏ సమయంలోనైనా పార్శిల్‌ను బుక్ చేసుకోవచ్చు. పికప్ మాత్రం పోస్టాఫీసు పనివేళల్లోనే ఉంటుంది. ఐఎంఏ యాప్ నుంచే ఖాతాదారులు తపాలా సుకన్య సమృద్ధి యోజన, కిసాన్ వికాస్ పత్రాలు తదితర పొదుపు పథకాల్లో డిపాజిట్ చేసేందుకు కూడా వెలుసుబాటు కల్పించారు.

ఐఎంఏ యాప్‌తో మరింత విస్తృతం



ప్రజలకు చేరువగా తపాలా సేవలు



ఆర్.నవీన్‌కుమార్, పోస్టల్ సూపరింటెండెంట్, అమలాపురం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

డివిజన్‌లోని అన్ని తపాలా కార్యాలయాలను అత్యాధునిక టెక్నాలజీతో అనుసంధానం చేశాం. ఇప్పటికే సేవలు ప్రారంభమయ్యాయి. రానున్న రోజుల్లో ప్రజలకు మరింత చేరువయ్యే విధంగా మరిన్ని సేవలను అందించనున్నాం. ప్రైవేటు ఈ-కామర్స్ సంస్థలకు పోటీగా సరికొత్త టెక్నాలజీతో ఐడీసీ సెంటర్లు ఏర్పాటు చేయనున్నాం. ఇప్పటికే కాకినాడ, రాజమహేంద్రవరం ప్రాంతాల్లో ఇంటిగ్రేటెడ్ డెలివరీ సెంటర్ (ఐడీసీ) సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఇకపై తపాలా శాఖ సొంత వాహనాల ద్వారానే పార్సిల్స్ సరఫరా చేసే విధంగా కేంద్ర తపాలా శాఖ చర్యలు చేపట్టింది. విదేశాలకు పంపించే పార్సిల్స్ సంఖ్య గతంలోకంటే పెరిగింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలైన తల్లికి వందనం, పీఎం కిసాన్ యోజన తదితర పథకాల నిధులను లబ్ధిదారులు గ్రామీణ ప్రాంతాల్లోని బ్రాంచి పోస్టాఫీసుల్లోనే పొందుతున్నారు.

అంకితభావంతో విధులు నిర్వర్తించాలి

ఎస్పీ బిందుమాధవ్.. హోంగార్డు నుంచి కానిస్టేబుల్స్‌గా ఎంపికైన 15 మందికి సత్కారం



కానిస్టేబుల్స్‌గా ఎంపికైన హోంగార్డులతో ఎస్పీ బిందుమాధవ్

కాకినాడ క్రైం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖలో చేరాలన్న జీవితాశయాన్ని సాధించేందుకు హోంగార్డుగా పనిచేస్తూ ఓ పక్క విధులు నిర్వర్తిస్తూ మరో పక్క కష్టపడి, పట్టుదలతో నెరవేర్చుకోవడం అభినందనీయమని కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్ అన్నారు. సుదీర్ఘ కాలంగా హోంగార్డులుగా పని చేస్తూ పోలీస్ సెలక్షన్స్‌లో కానిస్టేబుల్స్‌గా ఎంపికైన 15 మందిని మంగళవారం కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టపడి, అంకితభావంతో పనిచేస్తే ఫలితాలు సానుకూలంగా వస్తాయన్నారు. శిక్షణలో వృత్తి నైపుణ్యాలను మరింత పెంచుకోవాలన్నారు. భవిష్యత్తులో మంచిస్థాయికి చేరాలని ఆకాంక్షించారు. కాగా తమకు చదువుకునేందుకు తగిన సమయం ఇవ్వడమే కాకుండా, శ్యామ్ ఇనిస్టిట్యూట్ నుంచి స్టడీ మెటీరియల్స్ తీసుకువచ్చి అందించి కానిస్టేబుల్స్‌గా ఎంపికవ్వడంలో ఎస్పీ కీలక పాత్రపోషించార న్నారు. ఆయన సేవలను జీవితంలో మరవలేమన్నారు. అనంతరం 15 మందిని ఎస్పీ అభినందించి, సత్కరించారు. కార్యక్రమంలో ఏఎస్పీ ఏఆర్ ఎస్.శ్రీనివాసరావు, డీఎస్పీ ఏఆర్ శ్రీహరి రావు, హోంగార్డ్స్ ఆర్ఐ ఎం.నరసింహమూర్తి తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వాడపల్లి వెంకన్నకు ప్రత్యేక పూజలు

స్వామివారి ఆలయంలో రెండో రోజు వైభవంగా సాగిన పవిత్రోత్సవాలు



స్నపనమూర్తులకు అభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవా భాగంగా మంగళవారం రెండో రోజు ఘనంగా నిర్వహించారు. వసంత మండపంలో ఉత్సవ మూర్తులు కొలువుదీరారు. ఈ సందర్భంగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, ప్రోక్షణ, పవిత్ర ప్రతిష్ఠ, ప్రధాన హోమాలు, అష్టకలశరాధన, మహాస్నపనం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. వేదమంత్రాల సాక్షిగా వైఖానస ఆగమ శాస్త్ర ప్ర కారం ఖండవిల్లి రాజేశ్వర వరప్రసాదచార్యులు బ్రహ్మత్వంలో వేదపండితులు ప్రధాన హోమాలు, పవిత్ర ఆరోహణ కార్యక్రమాలను శాస్త్రోక్తం గా నిర్వహించారు. ఉపకమిషనరు ఈవో నల్లం సూర్యచక్రధరరావు పూజా కార్యక్రమాలను పర్యవేక్షించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పూజల్లో పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ఆలయంలోని వసంత మండపంలో పవిత్రోత్సవ పూజలు నిర్వహిస్తున్న పండితులు

జనవాణి వినతుల స్వీకరణ

సర్పవరం జంక్షన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశాలతో మంగళవారం మంగళగిరిలోని జనసేన కేంద్ర కార్యాలయంలో జనవాణి నిర్వహించారు. వివిధ సమస్యల పరిష్కారం, జీతాల పెంపుదల, ఉద్యోగ భద్రతపై ప్రజలు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది ఇచ్చిన వినతులను కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ స్వీకరించారు. మహిళలు, వివిధ వర్గాల ప్రజలు, సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత శాఖల అధికారుల తో ఎమ్మెల్యే నానాజీ మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు.



కాంట్రాక్టు ఉద్యోగుల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే పంతం నానాజీ

ఈ నెల 23 నుంచి ఉద్యోగులకు సీపీటీ పరీక్ష

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 340 మందికి నిర్వహణ

కాకినాడ జేఎన్టీయూలో ఏర్పాట్లు

కలెక్టరేట్ (కాకినాడ), ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాల్లో పని చేస్తున్న జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులు, అటెండర్లకు ఈ నెల 23, 24, 30 తేదీల్లో సీపీటీ (కంప్యూటర్ ప్రొఫిషియెన్సీ టెస్ట్) పరీక్ష నిర్వహించనున్నారు. ఈ మేరకు కాకినాడ జిల్లా కలెక్టర్, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నోడల్ అధికారి షాన్‌మోహన్ మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. కాకినాడ, అల్లూరి సీతారామరాజు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పు గోదావరి జిల్లాల్లోని ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న 340 మంది ఉద్యోగులకు కాకినాడ జేఎన్టీయూలో పరీక్ష జరగనుంది. ప్రభుత్వ ఉద్యోగులు కంప్యూటర్ పరిజ్ఞానం ఏ మేరకు ఆర్జించారో తెలుసుకునేందుకు ఈ పరీక్ష నిర్వహిస్తున్నారు.

క్రీడలతో శారీరక ఆరోగ్యం

- టీడీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్
- కాకినాడ కింగ్స్ క్రికెట్ జట్టు పరిచయ కార్యక్రమం
- వేడుకగా లోగో, జెర్సీ ఆవిష్కరణ



కాకినాడ కింగ్స్ లోగో ఆవిష్కరిస్తున్న జ్యోతుల నవీన్

కార్పొరేషన్(కాకినాడ), ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): క్రీడల ద్వారా శారీరక ఆరోగ్యంతోపాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని టీడీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్ అన్నారు. కాకినాడ గోదావరి కళాక్షేత్రంలో మంగళవారం ఆంధ్రా ప్రీమియర్ లీగ్(ఏపీఎల్)కు కాకినాడ కింగ్స్ క్రికెట్ జట్టు పరిచయ కార్యక్రమంతో పాటు లోగో, జెర్సీ ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన నవీన్ మాట్లాడుతూ గతంలో క్రీడాకారుల వయసు మీరినా అవకాశం వచ్చేది కాదని, ప్రస్తుతం ఉన్న వాళ్లకి ఏపీఎల్, ఐపీఎల్ అనే టోర్నమెంట్లు ఉపయోగకరంగా ఉంటున్నాయన్నారు. విద్యార్థులు టీవీ, సెల్‌ఫోన్లకు బానిసలు కాకుండా ఒత్తిడి లేని విద్యను అభ్యసించి క్రీడల్లో రాణించాలన్నారు. కాకినాడ కింగ్స్ పేరుతో ఒక క్రికెట్ జట్టు ఏర్పాటు కావడం ఆనందదాయకమన్నారు. ప్రతిభ కలిగిన యువ క్రీడాకారులకు సౌకర్యాలు కల్పిస్తామని రోటరీ గవర్నర్ డాక్టర్ కళ్యాణ్‌చక్రవర్తి పేర్కొన్నారు. కార్యక్రమంలో కాకినాడ కింగ్స్ ఫ్రాంచైజీ యజమానులు పుట్టా శరత్, అవినాష్, ఈవెంట్ ఆర్గనైజర్ కామిరెడ్డి రాజేష్, ఎల్.టిక్కు, బన్నీ, తోట సుబ్బారావు నాయుడు, కాకినాడ కింగ్స్ క్రికెట్ కెప్టెన్ భరత్ పాల్గొన్నారు.

ముగిసిన 'కింగ్స్' ప్రాక్టీస్

కాకినాడ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాకినాడలోని రంగరాయ వైద్యకళాశాల క్రీడా మైదానంలో ఐదు రోజులుగా చేస్తున్న ఆంధ్రా ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) కాకినాడ కింగ్స్ జట్టు ప్రాక్టీస్ మంగళవారం ముగిసిందని అసోసియేషన్ సెక్రటరీ వెంకటేష్ తెలిపారు. ప్రముఖ క్రికెటర్ కేఎస్ భరత్ సారథ్యంలో ఈ నెల 8 నుంచి విశాఖపట్నంలో జరగనున్న ఏపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లకు కాకినాడ కింగ్స్ జట్టు సన్నద్ధమైంది. ఏపీఎల్‌లో ఇప్పటి వరకు ఆరు టీమ్‌లు ఉండగా రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు కృషితో కాకినాడ కింగ్స్ జట్టుకు ఏడో జట్టుగా ఎంట్రీ లభించింది.



బ్యాటింగ్ ప్రాక్టీస్ చేస్తున్న కాకినాడ కింగ్స్ కెప్టెన్ భరత్

కేళ.. భళా

- మార్కెట్‌కు 30 వేలు అరటి గెలలు
- 'కర్పూరం'కు పెరిగిన డిమాండ్
- ధర.. రూ.200 నుంచి రూ.500



మార్కెట్‌కు గెలలు తీసుకొచ్చిన రైతులు

రావులపాలెం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): అంతరరాష్ట్ర అరటి మార్కెట్ యార్డుగా ఖ్యాతిగాంచిన రావులపాలెం అరటి మార్కెట్‌యార్డుకు మంగళవారం రికార్డుస్థాయిలో 30 వేలు అరటిగెలలు వచ్చాయి. ప్రతిరోజు స్థానిక అరటి మార్కెట్‌యార్డుకు రైతులు 10వేల నుంచి 12 వేల గెలలు తీసుకొస్తుంటారు. కాగా 30వేల అరటిగెలలు రైతులు తీసుకురావడంతో వ్యాపారులు, రైతులు అరటిలోడు, మోటార్‌సైకిళ్లతో మార్కెట్‌యార్డు ప్రాంతంతో పాటు సర్వీస్ రోడ్డు బయట పెద్దఎత్తున అరటి గెలలు దర్శనమిచ్చాయి. ఈ నెల 8న వరలక్ష్మివత్రం సందర్భంగా వ్యాపారులు కూడా ఇతర ప్రాంతాల నుంచి అరటి గెలలు కొనుగోలు చేసేందుకు మార్కెట్ యార్డుకు వస్తున్నారన్న సమాచారంతో రైతులు పెద్దఎత్తున అరటిగెలలను తీసుకువచ్చారు. నిన్నటి వరకూ కర్పూరరకం అరటిగెల రూ.150 నుంచి 300 వరకూ మాత్రమే పలికింది. శ్రావణ మాస పర్వదినాలలో అత్యంత ప్రాముఖ్యత కలిగిన వరలక్ష్మీ వ్రతం సందర్భంగా కర్పూర రకానికి భారీగా డిమాండ్ పెరిగి రూ.200 నుంచి రూ.500 వరకూ గెల ధర పలకడంతో రైతులు ఆనందపడ్డారు. మార్కెట్‌లో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సెక్రటరీ ఐఎస్ రాజువర్మ ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బెస్ట్ సహకార సంఘంగా దొమ్మేరు

కొవ్వూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): బెస్ట్ సహకార సంఘంగా దొమ్మేరు సొసైటీని ఎంపికచేసి అవార్డు అందజేశారు. ఈ నెల 4న విజయవాడలో ఆప్కాబ్ 62వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని ఉత్తమ పనితీరు కనబర్చిన సొసైటీలకు అవార్డులను అందజేశారు. దానిలో భాగంగా 2023-24 ఆర్థిక సంవత్సరంలో అందించిన సేవలకు గాను దొమ్మేరు వ్యవసాయ సహకార సంఘానికి బెస్ట్ పీఏసీఎస్‌గా అవార్డును అందజేశారు. ఈ అవార్డును రాష్ట్ర సహకారశాఖ మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు, ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు చేతుల మీదుగా దొమ్మేరు సొసైటీ అధ్యక్షుడు గారపాటి రామకృష్ణ, కార్యదర్శి కరిబండి ప్రసాద్ అందుకున్నారు. రూ.20 వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్‌ను అందజేశారు.



పోషణ పిచికారీతో బహుళ ప్రయోజనాలు




అవగాహన సదస్సులో మాట్లాడుతున్న శాస్త్రవేత్త భువనేశ్వరి

గొల్లప్రోలు రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మల్బరీ తోటలకు పోషక విలువలు అవసరమని, ఇందుకు మొక్కలు కత్తిరించిన 25-30 రోజుల వ్యవధిలో ఒక లీటరు పోషణను 140 లీటర్ల నీటిలో కలిపి ఎకరానికి పిచికారీ చేయాలని సెంట్రల్ సిల్క్ బోర్డు పరిశోధనా విస్తరణ కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ భువనేశ్వరి పేర్కొన్నారు. దీని వల్ల భూమిలో లభించని పోషకాలను పోషణ ద్వారా మల్బరీ మొక్కలు గ్రహిస్తాయని, తద్వారా పట్టు పురుగుల పెంపకం లాభదాయకంగా ఉంటుందని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న మేరా రేషమ్-మేరా అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టు రైతులకు పోషణ పిచికారీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఇన్‌చార్జి అసిస్టెంట్ సెరీకల్చర్ అధికారి కె.సత్యనారాయణ, టెక్నికల్ అసిస్టెంట్లు, పట్టు రైతులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు నాసిరకం గుడ్లు

- వాకపల్లికి, గజ్జెనపూడికి సరఫరా అయిన కుళ్లిపోయిన కోడిగుడ్లు
- ఇలాంటి తింటే రోగాల బారిన పడక తప్పదని లబ్ధిదారుల ఆవేదన





ప్రత్తిపాడు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు అంగన్‌వాడీ కేంద్రాలకు నాసిరకం గుడ్లు సరఫరా చేస్తున్నారు. దీంతో బాలింతలు, గర్భిణీలు, చిన్నారులు పౌష్టికాహారం కోసం ప్రభుత్వం ఎంతో సదుద్దేశ్యంతో అమలు చేస్తున్న పౌష్టికాహార పథకాన్ని అక్రమార్కులు నీరుగారుస్తున్నారు. మండలంలోని వాకపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రానికి కాంట్రాక్టర్ సరఫరా చేసిన గుడ్లు కుళ్లిపోవడమే కాకుండా కలిగిపోయి పాడైపోయినవి లబ్ధిదారులకు అందజేశారు. దీంతో వీటిని వినియోగించలేని పరిస్థితి ఎదురైంది. ఈ గుడ్లను పౌష్టికాహారంగా తీసుకుంటే రోగాల బారిన పడక తప్పదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే పరిస్థితి గజ్జెనపూడిలోని తదితర అంగన్‌వాడీ కేంద్రాలకు కాంట్రాక్టర్ నాసిరకం గుడ్లు సరఫరా చేస్తున్నట్టు తెలుస్తుంది. ఐసీడీఎస్ అధికారులు తక్షణం నాణ్యమైన గుడ్లు అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు.


సరస్వతీదేవి అలంకరణలో వనదుర్గ

సరస్వతీదేవిగా వనదుర్గ

- రత్నగిరి క్షేత్రరక్షకి ఆలయంలో శ్రావణ మాసోత్సవాలు
- సారె సమర్పించిన అన్నవరం దేవస్థానం వేదపండితులు


వనదుర్గమ్మకు సారె సమర్పిస్తున్న దేవస్థానం వేదపండితుల కుటుంబసభ్యులు

అన్నవరం, ఆగస్టు 5 (అన్నవరం): రత్నగిరి క్షేత్రరక్షకి వనదుర్గమ్మ ఆలయంలో శ్రావణ మాసోత్సవాల్లో భాగంగా రెండోరోజైన మంగళవారం అమ్మవారు సరస్వతీ అలంకరణలో దర్శనమిచ్చారు. భక్తకోటికి జ్ఞానాన్ని ప్రసాదించే సరస్వతిగా అనుగ్రహించారు. ఆలయంలో విశేషపూజలు, కుంకుమార్చనలు జరిగాయి. తొలిరోజు దేవస్థానం తరుపున ఈవో కుటుంబసభ్యులు సారె సమర్పించగా రెండోరోజు దేవస్థానం వేదపండితులు కుటుంబసభ్యులతో సారెను అందించగా అర్చకులు స్వీకరించి అమ్మవారి పాదాలచెంత ఉంచారు.

కాకినాడలో ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

జెండా ఊపి ప్రారంభించిన కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా క్రీడా మైదానం వేదికగా ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీని కలెక్టర్ షాన్‌మోహన్ ఆర్మీ అధికారులతో కలిసి మంగళవారం తెల్లవారుజామున జెండా ఊపి ప్రారంభించారు. కలె క్టర్ మాట్లాడుతూ ఈనెల 20 వరకు జరిగే ర్యాలీ నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 12 జిల్లాల నుంచి సుమారు 10వేల మంది అభ్యర్థులు ర్యాలీలో పాల్గొంటారని తెలిపారు. శారీరక పరీక్షల్లో అర్హత సాధించిన వారికి బుధవారం మెడికల్ టెస్టులు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్మీ అధికారులు, అభ్యర్థులు పాల్గొన్నారు.


ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్


ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీలో పాల్గొన్న అభ్యర్థులు

గుర్తుతెలియని వాహనం ఢీకొని లారీ క్లీనర్ మృతి


మరణించిన సయ్యద్ సాదిక్

కొవ్వూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొని కర్ణాటకకు చెందిన లారీ క్లీనర్ మృతి చెందినట్టు కొవ్వూరు రూరల్ హెడ్ కానిస్టేబుల్ చంద్రాల బాబూరావు తెలిపారు. వివరాల ప్రకారం.. కర్ణాటకలోని కొలార్ పట్టణంలోని రామత్‌నగర్‌కు చెందిన లారీ డ్రైవర్ సయ్యద్ రోషన్‌పాష, క్లీనర్ సయ్యద్ సాదిక్ జూలై 31న కెమికల్ లోడ్ వేసుకుని బెంగుళూరు నుంచి వైజాగ్ బయలుదేరారు. సోమవారం రాత్రి 7-15 గంటల సమయంలో తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మం డలం గోవర్ధనగిరిమెట్ట వద్ద లారీని రోడ్డు పక్కన పార్క్ చేసి భోజనానికి దిగారు. క్లీనర్ సయ్యద్ సాదిక్(42) రోడ్డు దాటుతుండగా గు ర్తుతెలియని వాహనం ఢీకొంది. దీంతో సాదిక్ అక్కడికక్కడే మృతి చెందాడు. లారీ డ్రైవర్ సయ్యద్ రోషన్‌పాష అందించిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు రూరల్ హెడ్ కానిస్టేబుల్ చంద్రాల బాబూరావు పేర్కొన్నారు..

విద్యుత్‌శాఖ నిర్లక్ష్యం... కుటుంబానికి శాపం!

- మృతుడి పేరుతో 17 విద్యుత్ కనెక్షన్లు
- రేషన్‌కార్డు దరఖాస్తులో బట్టబయలు
- అందని ప్రభుత్వ పథకాలు


దివ్యాంగ బాలుడు లిశాంత్‌రాజు


వద్దిపర్రుకు చెందిన అజ్జయ్య ఆధార్ నెంబరుతో 17 విద్యుత్ సర్వీసులు మంజూరు చేసిన దృశ్యం

ఆత్రేయపురం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): చనిపోయిన ఓ వ్యక్తి పేరు మీద 17 విద్యుత్ కనెక్షన్లు ఉన్నట్టుగా ఆన్‌లైన్‌లో చూపించడంతో ప్రభుత్వ పథకాలు పొందేందుకు ఆ కుటుంబ సభ్యులు అర్హత కోల్పోగా విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యం తేటతెల్లమైంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వద్దిపర్రుకు చెందిన పల్లె కొండ అజ్జయ్య అనే దళిత వృద్ధుడు ఇటీవల మరణించాడు. అతడి కుమారుడు భీమరాజు ఓ ప్రవేట్ స్కూల్‌లో పనిచేస్తున్నాడు. అర్జయ్య భార్యతో పాటు కుమారుడు భీమరాజు, భార్య ఒకే రేషన్‌కార్డులో ఉన్నారు. భీమరాజుకు రెండేళ్ల బాలుడు లిశాంత్‌రాజ్ ఉన్నాడు. పుట్టుకతోనే బాలుడికి మెదడు పనిచేయకపోవడంతో మంచానికి పరిమితమయ్యాడు. లిశాంత్‌కు నూరుశాతం పర్సంటేజీతో సదరం సర్టిఫికెట్ వైద్యులు మంజూరు చేశారు. కుమారుడి పేరు రేషన్‌కార్డులో నమోదు చేసేందుకు తండ్రి భీమరాజు గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసేందుకు వెళ్లగా మీ తండ్రి అర్జయ్య పేరు మీద 17 విద్యుత్ సర్వీసులు ఆన్‌లైన్‌లో ఉన్నట్టు చెప్పడంతో నిర్ఘాంతపోయాడు. సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లాడు.

ఎక్కడ జరిగింది తప్పు...

విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యానికి ఓ దళిత కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందకుండా పోతున్నాయి. బాలుడికి దివ్యాంగ పింఛన్ వస్తే వైద్యానికి ఉపయోగపడుతుందని ఆ కుటుంబం భావిస్తుంది. 2018లో విద్యుత్ మీటర్లకు ఆధార్‌లింక్ అనుసంధానం చేశారు. విద్యుత్ మీటర్లు ఉన్న వ్యక్తుల ఆధార్ కార్డు ఇంటిపన్ను రశీదులు సేకరించారు. ఏపీ ట్రాన్స్‌కో డివిజన్ కార్యాలయానికి సిబ్బంది పంపించారు. నియోజకవర్గంలోని 4 మండలాల విద్యుత్ మీటర్లకు ఆధార్‌నెంబరుతో అనుసంధానం చేశారు. ఆధార్ లింక్ చేసే సమయంలో సిబ్బంది చేతివాటం ప్రదర్శించారన్న ఆరోపణలు బలంగా ఏర్పడ్డాయి. కొంతమంది సిబ్బంది బినామి పేర్లతో ఆధార్‌లింక్ చేయడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. దీంతో అర్హత ఉండి ప్రభుత్వ పథకాలు అందక లబోదిబోమంటున్నారు.

హిజ్రాలపై బైండోవర్ కేసులు

తాళ్లరేవు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం సుంకరపాలెం నుంచి లచ్చిపాలెం వరకు 216 జాతీయ రహదారి పక్కన హిజ్రాల స్థావరాలపై కాకినాడ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కోరింగ ఎస్‌ఐ పి.సత్యనారాయణ బృందం మంగళవారం దాడులు చేసింది. ఐదుగురు హిజ్రాలను పట్టుకుని కేసులు నమోదు చేశారు. అనంతరం వారిని తాళ్లరేవు తహశీల్దారు కార్యాలయానికి పంపించారు. వారిపై తహశీల్దారు పి.త్రినాధరావు బైండోవర్ కేసులు నమోదు చేసి కౌన్సిలింగ్ ఇచ్చి పూచీకత్తులతో పంపించారు.

తండ్రి మందలించాడని కుమార్తె అదృశ్యం

కేసు నమోదు

అమలాపురం రూరల్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఎక్కువగా ఫోన్ మాట్లాడుతున్న కుమార్తెను తండ్రి మందలించడంతో అలిగి ఇంటి నుంచి వెళ్లిపోవడంతో అమలాపురం తాలూకా పోలీసులు మంగళవారం విద్యార్థిని అదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం నారాయణపేటకు చెందిన ఆకుల విజయభాస్కర్ కుమార్తె లోహిత తన పెద్దమ్మ అయిన కొండ్రెడ్డి రామలక్ష్మి ఇంటి వద్ద ఉండి డిగ్రీ ప్రైవేటుగా చదువుతోంది. రామలక్ష్మి కామనగరువు శివారు బాలయోగి కాలనీలో నివాసం ఉంటున్నారు. మంగళవారం ఉదయం ఇంటికి వచ్చిన తండ్రి విజయభాస్కర్ ఎక్కువగా ఫోన్‌లో మాట్లాడుతున్న కుమార్తె లోహితను మందలించాడు. దాంతో లోహిత మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లిపోయింది. అన్నిచోట్లా గాలించి ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో విజయ్‌భాస్కర్ తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసినట్టు హెడ్ కానిస్టేబుల్ మురళీమోహనకృష్ణ పేర్కొన్నారు.

శ్రీలంక సముద్ర జలాల్లో పట్టుబడిన కాకినాడ ఫైబర్ బోటు

నలుగురు మత్స్యకారుల అరెస్ట్

కాకినాడ సిటీ/ కె.గంగవరం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడకు చెందిన ఫైబర్ బోటును శ్రీలంక సముద్ర జలాల్లో సోమవారం రాత్రి గస్తీ సిబ్బంది పట్టుకున్నారు. స్థానిక జగన్నాథపురం వరదేశమ్మపేటకు చెందిన పంతాడి బ్రహ్మానందం కేరళలో రూ.40 లక్షలు పెట్టి ఫైబర్ బోటు కొనుగోలు చేసి కాకినాడ తీసుకు వస్తుండగా ఈ ఘటన జరిగింది. రామేశ్వరం బ్రిడ్జి దిగువ నుంచి రావాల్సిన బోటు జీపీఎస్ సాంకేతిక లోపం వల్ల చుట్టుతిరిగి ప్రయాణిస్తూ శ్రీలంక సముద్ర జలాల్లోకి వెళ్లిపోయారు. దీంతో ఆ దేశ గస్తీ సిబ్బంది ఫైబర్ బోటు, అందులోని నలుగురు మత్స్యకారులను అదుపులోకి తీసుకుని ఇక్కడి మత్స్యశాఖ అధికారులకు సమాచారం తెలిపారు. అదుపులోకి తీసుకున్న మత్స్యకారుల్లో పంతాడి బ్రహ్మానందం, చింతా నాగేశ్వరరావు, కర్రి నూకరాజు, కొప్పాడి శ్రీను ఉన్నారు. వారిని సురక్షితంగా తీసుకువచ్చేందుకు కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు జిల్లా అధికారులతో మాట్లాడారు. శ్రీలంకలో అరెస్టయిన మత్స్యకారుల్లో ఒకరైన కర్రి నాగరాజు అత్తగారి గ్రామం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలంలోని మసకపల్లి. నాగరాజు అరెస్టుతో గ్రామంలోని వారి కుటుంబం ఆందోళనకు గురైంది. ఆందోళన చెందవద్దని సర్పంచ్ పల్లి అన్నపూర్ణ కళ్యాణ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పి భరోసా ఇచ్చారు. అరెస్టయిన నలుగురిని తిరిగి భారత్‌కు తీసుకువస్తామని మత్స్యకార సంఘం నాయకుడు కర్రి చిట్టిబాబు తెలిపారు. మంగళవారం ఆయన కోటిపల్లిలో విలేకర్లతో మాట్లాడారు. దీనిపై రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర ద్వారా కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి శ్రీలంక అధికారులతో సంప్రదింపులు జరిపామని, త్వరలోనే వారిని దేశానికి తీసుకువస్తామని ఆయన చెప్పారు. ఆయా కుటుంబాలు వారు ఆందోళన చెందవద్దని కోరారు.


మసకపల్లిలో కర్రి నూకరాజు కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతున్న సర్పంచ్

ఉత్కంఠభరితంగా...

కాకినాడలో ఐదో రోజు జాతీయ మహిళా జూనియర్ హాకీ పోటీలు


కాకినాడలో హాకీ ఆడుతున్న ఆంధ్రప్రదేశ్, ఒడిస్సా టీంలు


కర్ణాటక, జార్ఖండ్ టీంలు

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): 15వ హాకీ ఇండియా జూనియర్ మహిళ జాతీయ చాంపియన్‌షిప్-2025లో భాగంగా మంగళవారం ఐదోరోజు కాకినాడ క్రీడా మైదానం ఆస్ట్రోటర్ఫ్ ఫీల్డ్‌లోని 6 మ్యాచ్‌లు జరిగాయి. తమిళనాడు వర్సెస్ ఢిల్లీ మ్యాచ్ ఉత్కంఠభరితంగా సాగి డ్రాగా ముగిసింది. మిగిలిన మ్యాచ్‌లు ఏకపక్షంగానే సాగాయి. మ్యాచ్‌లను రాష్ట్ర హాకీ సంఘ కార్యదర్శి హర్షవర్ధన్ ప్రారంభించారు. సంయుక్త కార్యదర్శి వి.రవిరాజు, కోశాధికారి, పి.తామస్ పీటర్, భవానిశంకర్ పర్యవేక్షించారు.

మ్యాచ్‌ల వివరాలు...

పుదుచ్చేరి, ఉత్తరాఖండ్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఉత్తరాఖండ్ 11-0తో విజయం సాధించింది. తమిళనాడు, ఢిల్లీ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 3-3 స్కోర్ నమోదు కావడంతో డ్రాగా ముగిసింది. చండీఘడ్, మధ్యప్రదేశ్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో మధ్యప్రదేశ్ 5-0తో విజయం సాధించింది. హర్యానా, బెంగాల్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో హర్యానా 7-1తో విజయం సాధించింది. కర్ణాటక, జార్ఖండ్ మధ్య జరిగిన మ్యాచ్‌లో జార్ఖండ్ 2-0తో విజయం సాధించింది. ఒడిస్సా, ఆంధ్రప్రదేశ్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఒడిస్సా 3-1 తేడాతో విజయం సాధించింది.

14న డిప్యూటీ సీఎం పవన్ రాక

- పిఠాపురంలో పారిశ్రామిక పార్కుకు శంకుస్థాపన
- హెలిప్యాడ్ పరిశీలించిన అధికారులు


గొల్లప్రోలులో హెలిప్యాడ్‌ను పరిశీలిస్తున్న పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు, అధికారులు

గొల్లప్రోలు/పిఠాపురం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో జరిగే స్వాతంత్ర దినోత్సవంలో పాల్గొనేందుకు ఈనెల 14వ తేదీన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కాకినాడ జిల్లాకు రానున్నారు. గొల్లప్రోలులో హెలిప్యాడ్‌కు చేరుకుని అదే రోజు సాయంత్రం పిఠాపురంలోని అగ్రహారం వద్ద ఏర్పాటు చేయనున్న పారిశ్రామిక పార్కుకు శంకుస్థాపన చేస్తారు. అక్కడ జరిగే కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం కాకినాడ బయలుదేరి వెళ్తారు. రాత్రికి కాకినాడలో బస చేసి 15న జరిగే స్వాతంత్ర దినోత్సవంలో పాల్గొంటారు. పవన్ హెలికాప్టర్‌లో రానున్న నేపథ్యంలో గొల్లప్రోలు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలోని హెలిప్యాడ్‌ను పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు, ఇతర పోలీసు అధికారులు మంగళవారం సాయంత్రం పరిశీలించారు. హెలిప్యాడ్ పరిసరాలు, అక్కడ చేయాల్సిన బందోబస్తు ఏర్పాట్లు తదితర అంశాలను వారు పరిశీలించారు. ఆయన వెంట పిఠాపురం సీఐ శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్‌ఐ రామకృష్ణ తదితరులు ఉన్నారు. కాగా పిఠాపురంలో అగ్రహారం వద్ద ఏర్పాట్లను జిల్లా అడిషనల్ ఎస్పీ భాస్కరరావు పరిశీలించారు. అక్కడ చేయాల్సిన బందోబస్తు, రక్షణ ఏర్పాట్లుపై సూచనలు ఇచ్చారు.

యర్రవరంలో జాతీయ పొల్యూషన్ బోర్డు కమిటీ సభ్యుల తనిఖీలు

ఏలేశ్వరం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం యర్రవరం గ్రామంలో ఉన్న అవంతి ఫ్రోజెన్ ఫుడ్స్ ప్రవేట్ లిమిటెడ్ పరిశ్రమలో మంగళవారం జాతీయ పొల్యూషన్ బోర్డు కమిటీ సభ్యులు తనిఖీలు చేశారు. పరిశ్రమ నుంచి విడుదలయ్యే వ్యర్థాలు, శుద్ధి చేయని వ్యర్థ జలాలతో పొల్యూట్‌గా మారి చుట్టుపక్కల ఉన్న గ్రామాల్లో ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారని పెద్దనాపల్లికి చెందిన చిన్ని ఫిర్యాదు మేరకు జాయింట్ కమిటీ తనిఖీలకు వచ్చింది. పరిశ్రమ నుంచి విడుదలయ్యే వ్యర్థ నీటిని పరిశ్రమ పరిధిలో సేకరించారు.


అవంతి పరిశ్రమ వద్ద నీటిని సేకరిస్తున్న కమిటీ సభ్యులు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు


క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

శంఖవరం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కత్తిపూడి శివారు కాకినాడ రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. రౌతులపూడి మండలం గిడజాం గ్రామానికి చెందిన ప్రవీణ్, విజయ్ కాకినాడ వెళ్లి తిరుగు ప్రయాణంలో వస్తుండగా పెట్రోలు బంక్ సమీపంలో లారీని తప్పించబోయి అదుపుతప్పి పడిపోయారు. ప్రవీణ్‌కు కాలు విరిగిపోగా, విజయ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వారిని 108లో పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పీడీఎస్ బియ్యం స్వాధీనం

జగ్గంపేట రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం రాజపూడి వద్ద అశోక్ లేలాండ్ వాహనంలో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ రేషన్ బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. డీఎస్‌వోకు అందిన సమాచారం మేరకు ప్రత్తిపాడు డీటీసీఎస్ ఏలేశ్వరం నుంచి గోకవరం వెళ్తుండగా మార్గమధ్యలో రాజపూడి వద్ద వాహనం ఆపి తనిఖీ చేసి సుమారు 3610 కిలోల అక్రమ రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.1,67,026 ఉంటుందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు వారు తెలిపారు.


స్వాధీనం చేసుకున్న బియ్యంతో అధికారులు

లాడ్జిలో ఉరేసుకున్న వివాహిత

కొవ్వూరు/కొత్తపల్లి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): లాడ్జి రూములో వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్టు కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం ఉప్పాడ సమీపంలోని కుతుకుడుమిల్లి గ్రామానికి చెందిన కాసా శివాని (30) సోమవారం రాత్రి తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు పట్టణంలోని మెయిన్‌రోడ్‌లో ఉన్న సాయిలక్ష్మి లాడ్జిలో దిగింది. మంగళవారం రాత్రి అయినా తలుపులు తెరవకపోవడంతో లాడ్జి సిబ్బంది అనుమానంతో పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పట్టణ సీఐ విశ్వం సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని తలుపులు తెరవడంతో రూములో సీలింగ్ ఫ్యాన్‌కు మహిళ చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. లాడ్జిలో అందించిన ఫోన్ నంబరు ఆధారంగా మహిళ బంధువుల ఆచూకీ తెలుసుకుని మృతి విషయాన్ని తెలియజేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేయాల్సి ఉంది. ఇదిలా ఉండగా శివాని కుటుంబ కలహాలతోనే విరక్తి చెంది ఉరి వేసుకుని ఉంటుందని సమాచారం.

గంజాయితో నలుగురి అరెస్ట్


గంజాయితో పట్టుబడిన నిందితులతో చింతూరు పోలీసులు

చింతూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): చింతూరు పోలీసులు మంగళవారం నలుగురిని అరెస్ట్ చేసి 12 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ రమేష్ కథనం మేరకు.. తెలంగాణ రాష్ట్రానికి చెందిన నవీన్ కుమార్, బాకి రాజు, సుంకే అశోక్, చింతూరుకు చెందిన షేక్ అబ్బాస్ అలియాస్ తుర్రం మహేష్ ముఠాగా ఏర్పడి ఒడిస్సాలో 12 కిలోల గంజాయి కొనుగోలు చేశారు. తదుపరి వయా చింతూరు మీదుగా తెలంగాణకు తరలించే యత్నంలో వాహన తనఖీల్లో భాగంగా అల్లూరి చింతూరు బస్‌స్టాండ్ వద్ద పోలీసులకు పట్టుపడ్డారు. రూ.60 వేలు విలువైన గంజాయితో పాటు నిందితులు వినియోగించిన 2 ద్విచక్ర వాహనాలు, 4 ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రమేష్ తెలిపారు.

బొగ్గు లారీ బోల్తా


ప్రత్తిపాడులో బోల్తా పడిన బొగ్గు లారీ

ప్రత్తిపాడు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మినర్వా కళాశాల సమీపంలో సుద్దగడ్డవాగు వంతెన వద్ద జాతీయ రహదారిపై మంగళవారం సాయంత్రం అదుపు తప్పి బొగ్గు లోడు లారీ బోల్తా పడింది. లారీ డ్రైవర్, క్లీనర్‌కు గాయాలయ్యాయి. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

వెంకన్న ఆలయంలో నేటి నుంచి పవిత్రోత్సవాలు

పిఠాపురం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): టీటీడీ నిర్వహణలో పట్టణంలో కొలువైయున్న పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం నుంచి ఈ నెల 9వ తేదీ వరకు పవిత్రోత్సవాలు జరగనున్నాయి. 6వ తేదీ సాయంత్రం అంకురార్పణ, 7న పవిత్రాల ప్రతిష్ఠ, 8న పవిత్రాల సమర్పణ, 9న పవిత్రాల విసర్జన, మహాపూర్ణాహుతి నిర్వహిస్తారు. భక్తులు హాజరు కావాలని టీటీడీ టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సందీప్ కోరారు.

'విద్యార్థుల సామర్థ్యాలను నిరంతరం పరిశీలించాలి'



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో రమేష్

పిఠాపురం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సామర్థ్యాలను నిరంతరం పరిశీలించడం ద్వారా వారి ప్రతిభ ఆధారంగా ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని జిల్లా విద్యాశాఖాధికారి పిల్లి రమేష్ సూచించారు. విద్యా శాఖ పెద్దాపురం డివిజన్ పరిధిలోని 11 మండలాల ఎంఈవోలు, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలకు పిఠాపురంలోని బాదం మాధవరావు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ ఏడాది జరిగిన పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు సాధించిన ఫలితాలు, ప్రస్తుత విద్యా సంవత్సరంలో పరీక్షలకు సన్నద్ధతపై సమీక్షించారు. ఫార్మాటివ్-1 సిలబస్‌ను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఎన్‌రోల్‌మెంట్ యుడైస్‌లో కొత్తగా వచ్చిన మార్పులు, ఇతర అంశాలను వివరించారు. సమావేశంలో డీవైఈవో ఇ.ప్రభాకరశర్మ, డీసీఈబీ జిల్లా కార్యదర్శి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.





సామర్లకోట, కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేట సబ్ స్టేషన్ల ఎదుట ధర్నా చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

స్మార్ట్ మీటర్లు మాకొద్దు

విద్యుత్ సబ్ స్టేషన్లను ముట్టడించిన ప్రజా సంఘాల నాయకులు

పిఠాపురం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులకు కరెంటు స్మార్ట్‌మీటర్లు బిగించడాన్ని వ్యతిరేకిస్తూ అఖిలపక్షం ఆధ్వర్యంలో పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ను మంగళవారం ముట్టడించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలను వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మాదేపల్లి సత్యానందం, సీపీఐ కార్యదర్శి సాకా రామకృష్ణ విద్యుత్ శాఖాధికారులకు వినతిపత్రం అందజేశారు. ఆందోళనలో వివిధ సంఘాల నాయకులు నక్కా శ్రీనివాసరావు, పేపకాయల ప్రసాద్, అరుణ్, ప్రదీప్, వడిసెల ప్రసాద్, పెదపాటి సత్తిబాబు, సత్యానందం తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): స్మార్ట్‌మీటర్ల బిగింపు నిర్ణయాన్ని నిరసిస్తూ పట్టణంలోని విద్యుత్ కార్యనిర్వాహక ఇంజనీరు కార్యాలయం ఎదుట సీపీఎం, సీపీఐ నాయకుల ఆధ్వర్యంలో ధర్నా చేశారు. విద్యుత్ సర్ చార్జీలను తక్షణం రద్దు చేయాలని, అదానీతో కుదుర్చుకున్న ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం విద్యుత్ శాఖ పెద్దాపురం ఈఈ ప్రభాకర్‌కు వినతి పత్రం అందజేశారు.

సర్పవరం జంక్షన్ (ఆంధ్రజ్యోతి): సీపీఎం నాయకులు చింతపల్లి అజయ్‌కుమార్, తొట్టిపూడి రాజా ఆధ్వర్యంలో రమణయ్యపేటలోని డి4 విద్యుత్ ఉప కేంద్రం వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ప్రజలంతా స్వచ్ఛందంగా వ్యతిరేకించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. డి4 ఏఈ గౌతంరాజుకి వినతిపత్రం అందించారు. సీపీఎం నాయకులు పెద్దింశెట్టి రామకృష్ణ, ఎ.కృష్ణాజీ, నాగేంద్ర, చంద్రశేఖర్, అప్పలరాజు, శ్రీను, సూరిబాబు, ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి): అదానీ స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని కొత్తపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద సీపీఐ (ఎంఎల్) లిబరేషన్, ఇతర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఏఈఈ శ్రీనివాసరావుకు నాయకులు గురాల అప్పారెడ్డి, ఎస్.అప్పలరాజు తదితరులు వినతి పత్రం అందజేశారు. తొలుత కొత్తపల్లి ఊర చెరువు సెంటరు నుంచి వాకతిప్ప, కుతుకుడుమిల్లి మీదుగా విద్యుత్ సబ్ స్టేషన్ వరకు ర్యాలీగా వెళ్లారు. ధర్నాలో సాంబశివ, చిన్ని, గంగాధర్, లోవకుమారి, సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్లు వద్దంటూ విద్యుత్ కార్యాలయం వద్ద ప్రజా వేదిక ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ప్రజా వేదిక కన్వీనర్ ఎస్.శ్రీనివాస్ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు రద్దు చేసి విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఏఈకి వినతి పత్రం అందజేశారు. భళ్లమూడి సూర్యనారాయణ, చింతల సత్యనారాయణ, వడ్డి సత్యనారాయణ, నీలపాల సూరిబాబు, దారపురెడ్డి క్రాంతికుమార్, కృష్ణ, గడిగట్ల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

తాళ్లరేవు (ఆంధ్రజ్యోతి): ప్రజా వేదిక ఆధ్వర్యంలో తాళ్లరేవు విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద వినియోగదారులు ధర్నా చేశారు. విద్యుత్ వినియోగదారుల సంఘం కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు మాట్లాడుతూ విద్యుత్ చార్జీల నిలువు దోపిడీని ఆపాలని, స్మార్ట్ మీటర్లు వేయవద్దని డిమాండ్ చేశారు. వల్లు రాజబాబు, అదృష్టదీపుడు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత

సామర్లకోట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హుస్సేన్‌పురం గ్రామానికి చెందిన తలారి ప్రియాంకకు వైద్య నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.42,250 మంజూరైంది. ఈ మొత్తాన్ని ఆమెకు చెక్కు రూపంలో పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప మంగళవారం అచ్చంపేటలోని తన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. టీడీపీ గ్రామ నాయకుడు చల్లా బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురం రూరల్ (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా పిఠాపురం మండలం మంగితుర్తి గ్రామానికి చెందిన రొంగల అప్పారావు మంజూరైన చెక్కును మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాటుసారా విక్రేతపై పీడీ యాక్ట్

సామర్లకోట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పండ్రవాడ గ్రామానికి చెందిన గెద్దాడ రాఘవ అనే మహిళ తరచూ నాటుసారాను విక్రయాలు జరుపుతూ డిసెంబరు 2023 నుంచి ఇప్పటివరకు ఆరు దఫాలుగా అరెస్టు అయ్యింది. సారా వ్యాపారం మానుకోకపోవడంతో కాకినాడ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఇచ్చిన నివేదికల ఆధారంగా కాకినాడ జిల్లా మేజిస్ట్రేట్ ఆమెపై పీడీ యాక్ట్ నిర్బంధ ఉత్తర్వులు అమలు జరపాలని ఆదేశించినట్టు కాకినాడ నార్త్ స్టేషన్ సీఐ కె.రామ్మోహనరావు మంగళ వారం సాయంత్రం విలేకరులకు తెలిపారు. నవోదయంలో భాగంగా రాఘవపై పీడీ యాక్ట్ అమలులో ఉన్నందున ఆమెను మంగళవారం రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలోని ప్రత్యేక మహిళా కారాగారానికి అప్పగించినట్టు సీఐ చెప్పారు.


విద్యార్థులకు నగదు పురస్కారాలు అందజేస్తున్న విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంకు డైరెక్టర్లు

పది మంది విద్యార్థులకు నగదు పురస్కారాలు

పిఠాపురం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ప్రతిభ కలిగిన విద్యార్థులను ప్రోత్సహించడంలో తాము ఎల్లప్పుడూ ముందుంటామని విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంకు డైరెక్టర్లు డాక్టర్ చెలికాని కృష్ణమోహన్, నామాన కామరాజు తెలిపారు. బ్యాంకు సభ్యులు, సిబ్బంది పిల్లల్లో ప్రతిభ కనబరిచిన పదో తరగతి విద్యార్థులు ఐదుగురికి రూ.5వేలు చొప్పున, ఇంటర్ విద్యార్థులు ఐదుగురికి రూ.7,500 వంతున నగదు పురస్కారాలు, ప్రశంసపత్రాలను పట్టణంలోని బ్యాంకు ఆవరణలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో వారు అందజేశారు. రీజనల్ మేనేజరు టీఆర్ ఠాగూర్, బ్రాంచి మేనేజరు గంధం రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కాంప్లెక్సు వరకు సామర్లకోట బస్సులు

పిఠాపురం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట-పిఠాపురం మధ్య తిరిగే ఆర్టీసీ బస్సులు అన్ని ట్రిప్పులు పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్సు వరకు నడిపేలా అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ విషయాన్ని నేషనల్ హ్యూమన్‌రైట్స్ కౌన్సిల్ జాతీయ సహ కన్వీనర్ డి.మణికుమార్ మంగళవారం తెలిపారు. సామర్లకోట నుంచి వచ్చే బస్సులను ఉప్పాడ సెంటర్ వరకే నడపడం వలన ప్రజలు, భక్తులు, విద్యార్థులు పడుతున్న ఇబ్బందులపై తాము పీజీఆర్ఎస్‌తో పాటు ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్టు చెప్పారు. దీనిపై తక్షణం స్పందించి ఆదేశాలిచ్చిన ఆర్టీసీ కాకినాడ డిపో మణికుమార్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

జర్నలిస్టుల డిమాండ్స్ డే

పెద్దాపురం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో జర్నలిస్టులు డిమాండ్స్ డే నిర్వహించారు. మున్సిపల్ కూడలి నుంచి ఆర్డీవో కార్యాలయానికి ప్రదర్శనగా చేరుకుని ఆర్డీవో కె.శ్రీరమణికి వినతిపత్రం అందజేశారు. ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, అక్రిడేషన్లు ఇవ్వాలని, పెన్షన్ సదుపాయం కల్పించాలని కోరారు. ఏపీయూడబ్ల్యూజే సభ్యులు రాకుర్తి రాంబాబు, అడపా వెంకట్రావు, మెల్లి సూర్యనారాయణ, వినాయక్, శ్రీరామ్, వర్మ, చంద్రదాసు, సుబ్బు, సత్యనారాయణ, ఈశ్వరరావు, ఫర్ ది పీపుల్ ఫౌండేషన్ చైర్మన్ గుణ్ణం లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

'చేయూత' రవి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

కాకినాడ సిటీ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ మొండి రవికుమార్ పుట్టిన రోజు సందర్భంగా మంగళవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. నగరంలోని టూటౌన్ బ్రిడ్జి దిగువున గల రోటరీ చేయూత భవన్‌లో నిర్వహించిన కార్యక్రమాలకు చేయూత సంస్థ కార్యదర్శి అలీమ్ అధ్యక్షత వహించారు. అతిథులుగా కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, ఎమ్మెల్సీలు పేరాబత్తుల రాజశేఖరం, కర్రి పద్మశ్రీనారాయణ, రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ కల్యాణచక్రవర్తి, పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ ఎస్‌వీఎస్ రావు, రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ గోపీనాథ్, కార్యదర్శి డాక్టర్ సాన ప్రవీణ్, లంక సాయిబాబు, వనమాడి మోహనవర్మ విచ్చేశారు. తొలుత రక్తదాన శిబిరం నిర్వహించా రు. 16 మంది బాలబాలికలకు సైకిళ్లు, ఇద్దరు మహిళలకు కుట్టుమిషన్లు, దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్న 80 మందికి పౌష్టికాహారం పంపిణీ చేశారు. మూడు అంబులెన్స్ సర్వీసులను ప్రారంభించారు. చేయూత వ్యవస్థాపక అధ్యక్షుడు రవికుమార్ మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా 70 మంది అనాథలు, వృద్ధులకు ఆశ్రయం కల్పిస్తున్నామన్నారు.


కరప మండలం పేపకాయలపాలేనికి చెందిన దుర్గాభవానికి సైకిల్ అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

కరప (ఆంధ్రజ్యోతి): కరప శివారు పేపకాయలపాలేనికి చెందిన చెందిన పేపకాయల దుర్గాభవాని కరప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి చదువుతోంది. ఆమె స్కూలుకు స్కూలుకు వెళ్లడానికి పడుతున్న ఇబ్బందిని ఆ గ్రామ మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు, కశిలింక రాజా... యంగ్ మైండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వాకాడ వెంకటరమణకు వివరించారు. ఆయన సూచనతో చేయూత స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ మెండి రవికుమార్, కార్యదర్శి అలీమ్, ఆర్థిక కార్యదర్శి చింతా నారాయణమూర్తి స్పందించి దుర్గాభవానికి సైకిల్ మంజూరు చేశారు. కాకినాడలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, ఎమ్మెల్యే వనమాడి కొండబాబు విద్యార్థినికి సైకిల్ అందజేసి బాగా చదువుకోవాలని సూచించారు.

'ఉప్పునీటి బోర్లు తీసివేసి రొయ్యల చెరువును పూర్తిగా తొలగించాలి'

తాళ్లరేవు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రొయ్యల చెరువులో ఉప్పు నీటిని పంట కాలువల్లోకి వదిలేయడంతో సుమారు 100 ఎకరాలల్లో వరి నాట్లు చనిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం పి.మల్లవరం కాశివానితూము ప్రాంతంలో రొయ్యల చెరువు యజమాని వనుముశెట్టి అప్పన్న ఉప్పునీటి బోర్లు వేసి రొయ్యల సాగు చేపట్టాడు. అవసరం లేని నీటిని పంట కాలువలోకి వదిలేశాడు. ఈ నేపథ్యంలో ఉప్పునీరు వదిలే కాలువను రైతులు స్వచ్ఛందంగా పూడ్చివేశారు. రైతు ధూళిపూడి నాగేశ్వరరావు మాట్లాడుతూ రొయ్యల చెరువు యజమానికి చాలాసార్లు చెప్పామని, పెద్దల సమక్షంలో తగవులు కూడా జరిగాయన్నారు. ఉప్పునీటి బోర్లను తీసివేసి రొయ్యల చెరువును పూర్తిగా తొలగించాలని డిమాండ్ చేశారు. కలెక్టర్ వద్దకు వెళ్లి ఈ విషయాన్ని వివరిస్తామన్నారు. రైతులు వెంటపల్లి రామకృష్ణ, ధూళిపూడి సత్యనారాయణ, దున్నా తాతారావు, మల్లిడి వెంకన్న, పెయ్యల జనార్దనరావు, సబ్బతి చిన్నారి, మల్లిడి నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

'ట్రాఫిక్ నియమాలు పాటించాలి'

సర్పవరం జంక్షన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రహదారి భద్రతా నిబంధనలు పాటించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని కాకినాడ ఐడీఏ కార్యదర్శి డాక్టర్ అడ్డాల సత్యనారాయణ కోరారు. అంతర్జాతీయ ట్రాఫిక్ లైట్ దినోత్సవం సందర్భంగా మంగళవారం ఏపీఐఐసీ కాలనీలోని అడబాల ట్రస్టు కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. అడబాల రత్నప్రసాదరావు, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.


డైరీని ఆవిష్కరిస్తున్న ప్రగతి విద్యా సంస్థల చైర్మన్ పూర్ణచంద్రరావు

వ్యాయామోపాధ్యాయుల డైరీ ఆవిష్కరణ

కాకినాడ రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో డైరీలు రూపొందించారు. వీటిని పీడీ యార్లగడ్డ బంగార్రాజు ఉపాధ్యాయులకు ఉచితంగా సమకూర్చారు. ప్రగతి విద్యా సంస్థల చైర్మన్ ఎస్.పూర్ణచంద్రరావు మంగళవారం డైరీలను ఆవిష్కరించి వ్యాయామ ఉపాధ్యాయులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాకినాడ జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘ అధ్యక్షుడు పి.శ్రీనివాస్, కార్యదర్శి వి.మాచరరావు, కోశాధికారి నాగలింగేశ్వరరావు సీనియర్ ఫిజికల్ డైరెక్టర్లు రవిరాజు, శ్రీనివాస్, రవికుమార్, పట్టాభి తదితరులు పాల్గొన్నారు.


అనధికారికంగా తూరలు వేయడంతో ధ్వంసమైన పాతర్లగడ్డ-గొర్రిపూడి ప్రధాన రహదారి (పాత చిత్రం), కాంక్రీట్ సిమెంటుతో రోడ్డును బాగు చేసిన దృశ్యం

ప్రయాణం సాఫీగా...

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కరప, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాతర్లగడ్డ-గొర్రిపూడి గ్రామాల మధ్య ప్రధాన రహదారి దుస్థితిపై గత నెల 17న 'రోడ్డు కట్.. చూసుకోకపోతే ఫట్..!' శీర్షికన ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి ఆర్అండ్‌బీ అధికారులు స్పందించారు. ధ్వంసమైన రోడ్డుపై సిమెంటు కలగలిపిన కాంక్రీట్‌ను వేసి గోతులను పూడ్చిపెట్టారు. దీంతో ప్రయాణం సాఫీగా సాగుతోందంటూ పలువురు సంతోషం వ్యక్తం చేస్తూ ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు తెలిపారు.

సామాజిక తనిఖీ ప్రజా వేదిక

కాకినాడ రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా విద్యా శాఖ కార్యాలయ సమావేశ మందిరంలో డీఈవో పి.రమేష్, సమగ్ర శిక్షా ఏపీసీ వేణుగోపాలరావు సమక్షంలో మంగళవారం సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. సామాజిక తనిఖీ రాష్ట్ర స్థాయి అధికారి పి.సింహాద్రి, జిల్లా స్థాయి అధికారులు ఎస్.చంద్రరావు, ఎం.అప్పన్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకం, పాఠశాలల పనితీరుపై సామాజిక తనిఖీ నిర్వహించి నివేదిక ఇచ్చారు. మధ్యాహ్న భోజన పథకం ఏడీ, జీసీడీ, ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు, కేజీబీవీ ప్రిన్సిపాల్స్ పాల్గొని తనిఖీ నివేదికలపై సమీక్ష జరిపి వాటి ఫలితాలను విశ్లేషించారు.


ఎస్ఐ మణికుమార్‌కి ఫిర్యాదు అందజేస్తున్న టీడీపీ నాయకులు

మాజీ ఎమ్మెల్యే వర్మపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం

బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు టీడీపీ నేతల ఫిర్యాదు

పిఠాపురం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మపై తప్పుడు ప్రచారం చేస్తూ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టడంపై టీడీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంధ్ర ఫోకస్ న్యూస్ పేరుతో వర్మ గౌరవాన్ని దెబ్బతీసేలా, ప్రజలను తప్పుదోవ పట్టించేలా పోస్టులు పెట్టారని వారు తెలిపారు. బాధ్యులపై తక్షణం చర్యలు తీసుకోవడంతో పాటు ఆ పోస్టులను తొలగించేలా చర్యలు చేపట్టాలని కోరుతూ మంగళవారం ఎస్ఐ మణికుమార్‌కు ఫిర్యాదు చేశారు. వారు కోరారు. కార్యక్రమంలో పాదగయ మాజీ చైర్మన్ కొండేపూడి సూర్యప్రకాష్, నాయకులు కొరుప్రోలు శ్రీనివాస్, నల్లా శ్రీను, మొల్లి నాగమరిడిరాజు, సూరవరపు సుబ్బారావు, జి.సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.


మైక్ సెట్ బహూకరిస్తున్న ఎస్ఎస్ఎల్‌సీ 1967-68 బ్యాచ్ విద్యార్థులు

కొత్తపల్లి ఉన్నత పాఠశాలకు మైక్ సెట్ బహూకరించిన పూర్వ విద్యార్థులు

కొత్తపల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సైకాలజిస్ట్ వడిశెట్టి నారాయణరెడ్డి చొరవతో ఉప్పాడ కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఎస్ఎస్ఎల్‌సీ 1967-68 బ్యాచ్ విద్యార్థులు మేరా యేసుదాసు, పెనుమల్లు వెంకట చక్రరెడ్డి, గురాల చక్రరెడ్డి, కడిమిశెట్టి త్రిమూర్తులు తదితరులు రూ.50వేలతో మైక్ సిస్టమ్, ఫర్నిచర్, కుర్చీలు, టేబుళ్లు సమకూర్చారు. మంగళవారం వీటిని ప్రధానోపాధ్యాయుడు శాస్త్రికి అందజేశారు. పూర్వ విద్యార్థులకు హెచ్ఎం, ఎస్ఎంసీ చైర్మన్ కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవోగా ప్రభాకరరావు బాధ్యతల స్వీకారం



కరప, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ఏపీవోగా రాయి ప్రభాకరరావు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. సామర్లకోట మండలం నుంచి బదిలీపై వచ్చిన ఆయన ఇన్‌చార్జి ఏపీవో హేమమాధురి నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఆయన్ను ఎన్ఆర్ఈజీఎస్ జేఈ సంగీతలక్ష్మి, టీఏలు కె.దుర్గ, పి.జానకి, పి.స్వామి, సీవోలు సుజాత, జయలక్ష్మి, ఫీల్డ్ అసిస్టెంట్లు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

'ఉద్యోగులు అవినీతికి పాల్పడితే సస్పెండ్'

రౌతులపూడి, ఆగస్టు5(ఆంధ్రజ్యోతి): సొసైటీలో ఉద్యోగులు అవినీతికి పాల్పడితే సస్పెండ్ చేస్తామనిడీసీసీబీ ఛైర్మన్ తుమ్మల బాబు అన్నారు. రౌతులపూడి సొసైటీ అధ్యక్షుడు పైల పైడిరాజు, పాలకవర్గ సభ్యులు తంటపురెడ్డి అప్పారావు జయసింగ్‌రావు ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి, టీడీపీ మండలాధ్యక్షుడు తమరాల సత్యనారాయణ, జనసేన నాయకుడు, మేడిశెట్టి బాబీ, రాష్ట్ర వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ పైల సాంబశివరావు పాల్గొన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

పీహెచ్‌సీని ఆకస్మిక తనిఖీ చేసిన పీవో

దేవీపట్నం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ వివిధ వ్యాధులతో వచ్చిన రోగులకు వెంటనే వైద్య పరీక్షలు నిర్వహించి ఆయా వ్యాధులకు ఉచిత మందులు అందజేయాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం దేవీపట్నం పీహెచ్‌సీని పీవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో ఎంత మంది వైద్యాధికారులు ఉన్నారు, సిబ్బంది, క్షేత్రస్థాయి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

మనమిత్ర వాట్సాప్‌పై అవగాహన

వై.రామవరం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం పలు సచివాలయాల పరిధుల్లో ఎంపీడీవో బాపన్నదొర ఆధ్వర్యంలో ప్రభుత్వం అమలుచేస్తున్న మనమిత్ర వాట్సాప్‌పై అవగాహన కల్పిస్తూ ర్యాలీలు, మానవహారాలు నిర్వహించారు. ప్రజల చేతిలో ప్రభుత్వం పేరుతో వాట్సాప్ గవర్నెన్స్ ప్రవేశపెట్టడం జరిగిందని, ప్రజలు వాట్సాప్ ద్వారా సమస్యలు పరిష్కరించుకోవచ్చని ఎంపీడీవో తెలిపారు.

మోతుగూడెం: డొంకరాయి గ్రామంలో సర్పంచ్ వేమ సంధ్యారాణి, కార్యదర్శి నాదెండ్ల రఘుబాబు ఆధ్వర్యంలో ప్రజ లకు, విద్యార్థులకు వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహన ర్యాలీ, సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీటీసీ సభ్యులు కరకా వెంకటరమణ హాజరయ్యారు.

చలో మారేడుమిల్లి జయప్రదం చేయాలి

చింతూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ఘనంగా జరుపుకుందామని ఆదివాసీ డివిజన్ జేఏసీ ఛైర్మన్ జల్లి నరేష్ పేర్కొన్నారు. చట్టిలో మంగళవారం ఆదివాసీ నాయకుల చిత్రపటాలకు పూల మాలలువేసి నివాళులు అర్పించారు. ఈనెల 8న తలపెట్టిన చలో మారేడుమిల్లి కార్యక్ర మం జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో చట్టి సర్పంచ్ రవ్వ భద్రమ్మ, నాయకులు కాకా సీతారామయ్య, పొడియం లక్ష్మణ్, మాజీ సర్పంచ్ తుర్రం రామయ్య తదితరులు పాల్గొని ఆదివాసీ జెండాను ఆవిష్కరించారు.

మెగా డీఎస్సీని ఆదివాసీ అభ్యర్థులతో భర్తీ చేయాలి

మోతుగూడెం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఏజెన్సీ ఆదివాసులకు ఎన్నికలహామీ 100శాతం ఏజెన్సీ ఉద్యోగాలు భర్తీ హామీ అమలు చేయకుండా మెగా డీఎస్సీ పేరుతో ఏజెన్సీ పోస్టులను జనరల్ డీఎస్సీగా నియామకం నిలుపుదల చేసి ఏజెన్సీ టీచర్ పోస్టులను ఏజెన్సీ ఆదివాసులతో భర్తీ చేయాలని గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు సీసం సురేష్ డిమాండ్ చేశారు. మంగళవారం అల్లిగూడెం, మోతుగూడెం కేంద్రాలలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ఆగస్టు 9న ఆదివాసి సంస్కృతి సంప్రదాయాల వేదిక కోయితోర్ పండుందక్కడుకూనవరం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు.

'రబ్బరు రైతుల ఆర్థికాభివృద్ధికి చర్యలు'

మారేడుమిల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి):ఏజెన్సీలో రబ్బరు రైతుల ఆర్థికాభివృద్ధికి అవ సరమైన అన్నిచర్యలు చేపడుతున్నామని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం అన్నారు. మంగళవారం మండలంలోని దేవరపల్లి గ్రామంలో కేరళ కొట్టాయం రబ్బరు బోర్డు కమిషనర్ సుజి, రబ్బరు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వసంత్ గీసన్‌లతో కలిసి రబ్బరు రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ రబ్బరు సాగు ద్వారా రైతులు అధిక లాభాలు పొందవచ్చని, రైతులకు అవసరమైన రబ్బరు ప్రోసెస్ రోలర్స్ ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఐటీడీఏ ద్వారా రబ్బరు రైతులకు అవసరమైన పరికరాలను, సాగుపై అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. రబ్బరు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వసంత్ గీసన్ మాట్లాడుతూ ఏపీలో రంపచోడవరం ఐటీడీఏ పరిధిలో ఈ ప్రాంతంలో రబ్బరు ప్లాంటేషన్ ఉందని, అందు అనువైన వాతావరణం ఉందన్నారు. రబ్బరు సొసైటీని అభివృద్ధి చేసే విధంగా రబ్బరు బోర్డు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుందన్నారు.. రబ్బరు బోర్డు జాయింట్ డైరెక్టర్ టి.ఆర్మగం, జడ్పీటీసీ గొర్లె బాలాజీబాబు, రబ్బరు బోర్డు ఏడీవో ప్రశాంత్‌కుమార్ నాయక్, డాక్టర్ సుశీల్‌కుమార్, పీహెచ్‌వో దేవదానం, గోవిందస్వామి, రబ్బరుబోర్డు క్షేత్రస్థాయి అధికారి సాల్మన్‌రాజు పాల్గొన్నారు.

ఇన్ సర్వీస్ కోటా తగ్గింపు దారుణం

మోతుగూడెం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ హెల్త్ సెంటర్ల డాక్టర్ల అసోసియేషన్ (ఏపీపీహెచ్‌సీడీఏ)రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తీసుకున్న కీలక నిర్ణయమైన 2025-26విద్యా సంవత్సరం నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో (పీహెచ్‌సీఎస్) పనిచేస్తున్న ఇన్‌సర్వీస్ డాక్టర్లకు ఉన్న పీజీ (పోస్ట్ గ్రాడ్యుయేట్) కోటాను 20 శాతం నుంచి 15 శాతానికి తగ్గించే నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తుంది. అది కూడా కేవలం జనరల్ మెడిసిన్ , జనరల్ సర్జరీ, పీడియాట్రిక్స్ గైనకాలజీ, అనస్తీషియా, ఎమర్జెన్సీ మెడిసిన్, రేడియాలజీ వంటి ఏడు క్లినికల్ శాఖలకే పరిమితం చేశారు.

'స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలి'

రంపచోడవరం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ బిల్లులలో ట్రూ ఆఫ్ ఛార్జీల పేరుతో వసూలు చేస్తున్న అదనపు భారాలు, స్మార్ట్ మీటర్లు బిగింపు రద్దు చేయాలని, విద్యుత్ రంగంలో స్వదేశీ, విదేశీ కార్పొరేట్లకు లాభాలు చేకూర్చి ప్రజలపై భారాలు మోపే సంస్కరణలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా ఏజెన్సీ గిరిజన సంఘం, రైతుల కూటీ సంఘం(ఆంధ్రప్రదేశ్), అఖిల భారత రైతుకూలీసంఘం, సీపీఎం, ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ థాణా నుంచి విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్‌కు వినతిపత్రం అందజేశారు. తొలుత స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో మానవహారం చేపట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రజా సంఘాల ఐక్య వేదిక నాయకులు కుంజా దూలయ్య, కె.బాలురెడ్డి, తాటి బుల్లబ్బాయి, వంజం జోగారావు, మట్ల వాణిశ్రీ, వేట్ల సత్యనారాయణ, పోలిన వెంకటకృష్ణ, పి.లచ్చిరెడ్డి,ఐ.వి.రమణ, కె.బాలురెడ్డి, పి.అనసూయ, వేట్ల శ్రీరాములు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు ఉపసంహరించుకోవాలి

ఎటపాక,ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్లు, సర్దుబాటు ఛార్జీలు వెంటనే కూటమి ప్రభుత్వం ఉసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో బుట్టాయి గూడెం సబ్‌స్టేషన్‌వద్ద నిరసన కార్యక్రమంను నిర్వహించారు. ఈసందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి కాకా అర్జున్ మాట్లాడారు. అనంతరం విద్యుత్ శాఖ ఏఈ సూరిబాబుకు వినతి పత్రంను అందజేశారు.

విద్యుత్ ఛార్జీల భారం మోపొద్దు

చింతూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఛార్జీల భారం పెంచి వినియోగదారులపై భారం మోపే చర్యల్ని ప్రభుత్వం వెనక్కు తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి పల్లపు వెంకట్ డిమాండ్ చేశారు. మంగళవారం ఈ మేరకు తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని చింతూరు విద్యుత్‌శాఖ జేఈఈ సతీష్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడారు. కార్యక్రమంలో నాయకుల సీసం సురేష్; పొడియం లక్ష్మణ్; కారం సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నరసాపురం మెటల్ క్వారీపై నిర్లక్ష్య ధోరణి

రంపచోడవరం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని నరసాపురం మెటల్ క్వారీపై అధికారులు నిర్లక్ష్యధోరణి అవలంబిస్తున్నారని ఆదివాసీ సంక్షేమ పరిషత్(274/16) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను అన్నారు. మెటల్ క్వారీలు చట్ట విరుద్ధంగా ఉన్నాయని, చుట్టు ప్రక్కల గ్రామాల రైతులు నష్టపోతున్నారని ఆరోపించారు. క్వారీపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఆదివాసీ సదస్సును విజయవంతం చేయాలి

రంపచోడవరం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రంపచోడవరం ఆర్‌పీ పంక్షన్ హాల్లో ఈ నెల 8వ తేదీన జరిగే పాపికొండల నేషనల్ పార్క్ వ్యతిరేక ఆదివాసీ సదస్సును విజయవంతం చేయాలని సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నాయకులు కుంజా దూలయ్య, పల్లాల లచ్చిరెడ్డి మంగళవారం ప్రకటనలో పిలుపునిచ్చారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

ఎన్నికల్లో చిత్తుగా ఓడినా మారని జగన్ తీరు

● ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ
● శంఖవరంలో ఊయల కార్యక్రమం ప్రారంభం


శంఖవరంలో ఊయల కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

ప్రత్తిపాడు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు వైసీపీని చిత్తుగా ఓడించి ప్రతిపక్ష హోదా కూడా కల్పించకపోయినా ఆ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి తీరు ఇప్పటికీ మారకపోవడం దారుణమని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా విమర్శించారు. మంగళవారం పెదశంకర్లపూడి పార్టీ కార్యాలయం వద్ద ఆమె విలేకరులతో మాట్లాడారు. జగన్ ప్రభుత్వంలో మంత్రులుగా, ఎమ్మెల్యేలుగా వివిధ ఉన్నత పదవులు చేపట్టిన నాయకులు సైతం నైతికతను విడిచిపెట్టి, సమాజం గమనిస్తుందనే భయం లేకుండా మహిళలపై, మహిళా ఎమ్మెల్యేపై అసభ్యపదజాలంతో మాట్లాడటం దుర్మార్గమన్నారు. ఇటువంటి నాయకులను పార్టీలో కొనసాగిస్తున్నా జగన్ లాంటి వ్యక్తులు రాజకీయాల్లో కొనసాగడం దురదృష్టకరమన్నారు. తన అనుచరులతో తల్లి, చెల్లిని అవమాన పరిచేవిధంగా సోషల్ మీడియాలో జగన్ తప్పుడు ప్రచారాలు చేయించారన్నారు. ఇలాంటి వ్యక్తికి మహిళలు, సమాజంపై గౌరవం ఉంటుందనుకోవడం భ్రమేనని సత్యప్రభ చెప్పారు. నాసిరకం కల్తీ మద్యం వ్యాపారం చేసి రాష్ట్రంలో ఎందరో ప్రాణాలు బలి తీసుకున్నారన్నారు. వేల కోట్ల రూపాయలు అవినీతికి పాల్పడిన జగన్ రెడ్డి జైలుకు వెళ్లక తప్పదని సత్యప్రభ తెలిపారు.

పిల్లలు ఉండాల్సింది ఊయల్లో

శంఖవరం, ఆగస్టు5(ఆంధ్రజ్యోతి): పసిపిల్లలు ఊయలలో హాయిగా ఉండాలని.. చెత్తకుండీలు, తుప్పల్లో కాదని అలాంటి పరిస్థితి ఏబిడ్డకు రాకూడదనే మిషన్ వాత్సల్య కార్యక్రమం ప్రారంభమైందని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మిషన్‌వాత్సల్య కార్యక్రమంలో ఊయలను ఆమె ప్రారంభించారు. జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మేడిశెట్టి సూర్యకిరణ్(బాబి), టీడీపీనేత పర్వత సురేష్, మండలాధ్యక్షుడు బద్ది రామారావు, వెన్నా ఈశ్వరుడు, ఉపసర్పంచ్ చింతనీడి కుమార్, పైల సాంబశివరావు, బచ్చలగంగ, ఇటంశెట్టి సూర్యభాస్కరరావు, కరణం సుబ్రహ్మణ్యం, గాబు సుభాష్ పాల్గొన్నారు.

మన మిత్రపై అవగాహన ర్యాలీ

గండేపల్లి, ఆగస్టు5(ఆంధ్రజ్యోతి):గ్రామాల్లోసమస్యలు పరిష్కరించేందుకు, ప్రభుత్వ సేవలు స్వయంగా అందించాలనే మన మిత్ర కార్యక్రమం ద్వారాప్రభుత్వం వాట్సాప్ నెంబరు విడుదల చేసిందని పంచాయతీరాజ్ డీడీవోశ్యామల తెలిపారు.మంగళవారం గండేపల్లిలో నిర్వహించిన ర్యాలీలో ఆమె పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు. ఎంపీడీవో కె.చంద్రరావు,కార్యదర్శి ఫణీంద్ర కుమార్, టీడీపీగ్రామాధ్యక్షుడు బొల్లంరెడ్డి రామకృష్ణ పాల్గొన్నారు.

టీడీపీ మండల అనుబంధ కమిటీ ఏర్పాటు

కిర్లంపూడి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): భూపాలపట్నంలో టీడీపీ మండలాధ్యక్షుడు వీరంరెడ్డి కాశీబాబు స్వగృహంలో మంగళవారం టీడీపీ కిర్లంపూడి మండల అనుబంధ సంస్థల కమిటీని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి జగ్గంపేట నియోజవర్గ అబ్జర్వర్ జనపరెడ్డి బాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఏలూరు ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్ బస్వా వీరబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ తోట రవి, సొసైటీ ఛైర్మన్లు తోటగాంధీ, కుర్ల చిన్నబాబు పాల్గొన్నారు. టీడీపీ మండల ఉపాధ్యక్షుడుగా ఆళ్ల శ్రీమన్నారాయణ, ప్రధాన కార్యదర్శిగా గోడే దొరబాబు, మండల కార్యనిర్వాహక కార్యదర్శులుగా జంపన రవి వర్మ, పెనగంట బాబ్జి, కాకిలేటి వెంకటరాజు, మండల కార్యదర్శిగా మూరా సత్తిబాబు, సేనాపతి రంగబాబు, నీలం వీరబాబు, మండల కోశాధికారిగా పెరాట్ల కృష్ణమూర్తిని ఎంపిక చేశారు. మండల అధ్యక్షుడు కాశీ బాబుని సత్కరించి కేక్ కట్ చేశారు. డీసీ ఛైర్మన్ నీలం శ్రీను, అనుకుల శ్రీకాంత్, పాఠంశెట్టి మురళీకృష్ణ, గుడాల రాంబాబు, గండే కాశీ విశ్వనాథ్, మాజీ సర్పంచ్ సూరిశెట్టి వెంకటశివ పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే లక్ష్యం: ఎమ్మెల్యే సత్యప్రభ

రౌతులపూడి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. రౌతులపూడి, ఎ.మల్లవరం గ్రామాలకు చెందిన రైతులకు ప్రభుత్వ సబ్సిడీతో అందించిన కిషాన్ డ్రోన్లను మంగళవారం అందజేశారు. అలాగే సొసైటీ నూతన అధ్యక్షుడు పైల పైడిరాజు, పాలకవర్గ సభ్యులు తంటపురెడ్డి అప్పారావు, గుండుబెల్లి జయసింగ్‌రావులతో ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం నూతన పోలీస్‌స్టేషన్ భవన నిర్మాణానికి రెండు చోట్ల స్థల పరిశీలన చేశారు. ఎంపీపీ గంటి మళ్ల రాజ్యలక్ష్మి, టీడీపీ మండలాధ్యక్షుడు తమరాల సత్యనారాయణ, సీనియర్ నేత సింహాద్రి పెదబాబు, మాజీ ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

సహకార రంగం అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం


మాట్లాడుతున్న యనమల రామకృష్ణుడు

కోటనందూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): సహకార రంగం అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు అన్నారు. మంగళవారం కోటనందూరు మదర్ విద్యా సంస్థల ఆవరణలో కోఆపరేటివ్ సొసైటీ పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. అధ్యక్షుడిగా పెనుముచ్చు నాగేశ్వరరావు, డైరెక్టర్లగా భైలపూడి శ్రీరామమూర్తి, ముప్పిడి జమీలతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈసందర్భంగా యనమల మాట్లాడుతూ సహకార వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి రైతాంగాన్ని ఆర్థికంగా అదుకున్న ఘనత టీడీపీదేనన్నారు. టీడీపీ సీనియర్ నేతలు యనమల రాజేష్, చింతంనీడి అబ్బాయి, సుర్లలోవరా జు, గాడిరాజుబాబు, పెంటకోటభాస్కరసత్యనారాయణ, మార్కెట్ కమిటీ ఛైర్మన్ అంకంరెడ్డి రమేష్, మండలాధ్యక్షుడు పోతల సూరిబాబు పాల్గొన్నారు.

రాజపూడి సొసైటీ ఛైర్మన్‌గా వెంకటేశ్వరరావు


వెంకటేశ్వరరావు బాధ్యతలు స్వీకరిస్తున్న దృశ్యం

జగ్గంపేట రూరల్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): రాజపూడి ప్రాథమికసహకార పరపతి సంఘం ఛైర్మన్‌గా ఉప్పలపాటి వెంకటేశ్వరరావు (బుల్లెబ్బు) ప్రమాణ స్వీకారం చేశారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఛైర్మన్‌కు సొసైటీ సీఈవో పిల్లా అప్పారావు స్వాగతంపలికి శుభాకాంక్షలు తెలిపారు. ఛైర్మన్ వెంకటేశ్వరరావు, కమిటీ సభ్యులు చింతల కన్నారావు (జే.కొత్తూరు), గండికోట శ్రీను (మన్యంవారిపాలెం) బాధ్యతలు స్వీకరించారు. రాజపూడి గౌరీశంకర్ కల్యాణ మండపంలో రేఖ బుల్లిరాజు అధ్యక్షతన సమావేశ నిర్వహించారు. ఎస్వీఎస్ అప్పలరాజు, కోర్పు లచ్చయ్యదొర,ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్త కొండబాబు, ఆడప భరత్, జగ్గంపేట, కిర్లంపూడి, గండేపల్లి మండలాధ్యక్షులు జీను మణి బాబు, వీరంరెడ్డి కాశీబాబు, పోతుల మోహనరావు, జడ్పీటీసీ తోట గాంధీ, కందుల చిట్టిబాబు, సొసైటీ ఛైర్మన్లు బుర్రి సత్తిబాబు, తోట గాంధీ, కందుల కొండయ్యచౌదరి, కంటిపూడి సత్తిబాబు పాల్గొన్నారు.

టీడీపీ మండల ఉపాధ్యక్షుడిగా బాలనాగు

జగ్గంపేట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల ఉపాధ్యక్షుడిగా గుర్రంపాలెం సాగరపేటకి చెందిన పోంద్రు బాలనాగును ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ నియమించారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించి ఆశీస్సులు తీసుకున్నారు. పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. టీడీపీ మండల కార్యదర్శి పడాల ఈశ్వరరావు, కట్టమూరి రామకృష్ణ, నక్క వెంకటేష్, పోంద్రు అప్పన్న, ముల్కి శివకుమార్, ముల్కి వెంకన్న, ముల్కి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

జగ్గంపేటరూరల్, ఆగస్టు5(ఆంధ్రజ్యోతి): కాట్రావులపల్లికి చెందిన ఎన్ఆర్ఐ కల్లేపల్లి రాజేష్ జన్మదినం సందర్భంగా కాట్రావులపల్లి యూత్, రాజేష్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వ హించారు. జనసేన పార్టీ జగ్గంపేట ఇన్ చార్జ్ తుమ్మలపల్లి రమేష్ ముఖ్యఅతిథిగా హాజరైన శుభాకాంక్షలు తెలిపారు. యువసేన సతీష్, నల్లల శివ, కాట్రావులపల్లి ప్రసాద్, సుంకర శ్రీను, అడబాల వీరబాబు, మాదారపు వీరబాబు, కాయల మణి కంఠ, పాలెం బాబీ, కురుమళ్ళ నాగేశ్వరరావు, పాల్గొన్నారు

నూతన సీహెచ్‌సీలో వైద్య సేవలు

గండేపల్లి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): జడ్.రాగంపేట గ్రామ శివారునూతనంగా నిర్మించిన జగ్గంపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో గురువారం నుంచి వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయని సూపరిండెంట్ డాక్టర్ ప్రణీత్ తెలిపారు. రోగులు ఆసుపత్రిలో వైద్య సేవలు పొందాలన్నారు.

'నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు'

తునిరూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని తుని పట్టణ సీఐ గీతా రామకృష్ణ అన్నారు. తునిలో డ్రైవింగ్ లైసెన్సులు లేకుండా వాహనాలు నడపడం, ఇసుక ట్రాక్టర్లు, అధిక లోడ్‌తో నడుపుతున్న మట్టి ట్రాక్టర్లు, వాహనాలపై ఫిర్యాదులు అందడంతో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి పలు కేసులు నమోదు చేసినట్టు తెలిపారు.

సుభాష్‌కి ఉత్తమసేవా అవార్డు

శంఖవరం, ఆగస్టు 5(ఆగస్టు): తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు కీర్తి వెంకట సుభాష్‌కి ఉత్తమసేవా అవార్డు లభించింది. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకునివిశాఖపట్నం శ్రీఫౌండేషన్ సభ్యులు మంగళవారం ఈఅవార్డును అందజేశారు. శ్రేణులు అభినందనలు తెలిపారు.

టీడీపీ కిర్లంపూడి కార్యదర్శిగా దొరబాబు



కిర్లంపూడి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): తెలుగు దేశం పార్టీ మండల కార్యదర్శిగా రాజుపాలెం గ్రామానికి చెందిన గోడే దొరబాబుని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ నియమించారు. తనపై ఎంతో నమ్మకంతో బాధ్యతలు అప్పజెప్పిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్‌కు దొరబాబు కృతజ్ఞతలు తెలియజేశారు.

తల్లి పాలు బిడ్డకు శ్రేయస్కరం

తునిరూరల్, ఆగస్టు5(ఆంధ్రజ్యోతి): తల్లి పాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరమని, అనేక ప్రయోజనాలు ఉన్నాయని తుని సీడీపీవో కె.శ్రీలత అన్నారు. వీరవరపుపేట సెక్టార్‌లో రావడవీధిలో మంగళవారం తల్లి పాల వారోత్సవాలు నిర్వహించారు. వెల్ బేబీ షో నిర్వహించి బహుమతులు అందించారు. తల్లిపాల ఆవశ్యకతను వివరించారు.

స్మార్ట్ మీటర్లు వద్దంటూ ధర్నా

ప్రత్తిపాడు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్మార్ట్ మీటర్లు వద్దని డిమాండ్ చేస్తూ ప్రత్తిపాడు కరెంటు ఆఫీస్ వద్ద మంగళవారం సీఐటీయూ నాయకులు ధర్నా నిర్వహించారు. దీనికి నాయకత్వం వహించిన జిల్లా నాయకులు చెక్కల రాజకుమార్ పలు అంశాలపై మాట్లాడారు. ప్రజా సంఘాల నాయకులు రొంగల ఈశ్వరరావు, మెట్ల శ్రీను, పాకలపాటి సోమరాజు, పి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఏలేశ్వరం, (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్లు వద్దంటూ సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు నేతృత్వంలో ఏలేశ్వరంలో ధర్నా నిర్వహించారు. విద్యుత్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో అంతిరెడ్డి నాగమణి, ఖండవల్లి రాజు, కుమ్ములూరి ఏగిలియ్య పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి మండల కమిటీలు కృషి చేయాలి

ప్రత్తిపాడు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో భారతీయ జనతా పార్టీ బలోపేతం అయ్యేందుకు మండల కమిటీలు, నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కుండల సాయికుమార్ యాదవ్ కోరారు. మంగళవారం స్థానిక రాజా కింగ్ బాబు రాజు స్వగృహం వద్ద నిర్వహించిన నియోజకవర్గ ముఖ్య నాయకులు, మండల కమిటీల సభ్యుల సమావేశానికి ఆ పార్టీ బీజేపీ సీనియర్ నాయకుడు సింగిలిదేవ్ సత్తిరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ ఈ నెల 10 నుంచి 15 వరకు గ్రామాల్లో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. మండల కేంద్రాల్లో 10, 11, 12 తేదీల్లో ర్యాలీ, 13న ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఆవిష్కరణ, 14న కొవ్వొత్తుల ర్యాలీ, 15న జాతీయ జెండా ఆవిష్కరించాలని కోరారు. బీజేపీ నాయకులు రెడ్డి లోవరాజు, ఏనుగు ధర్మరాజు, వరహాలు, కత్తి ప్రసాద్, కందా వీరాస్వామి పాల్గొన్నారు. అనంతరం ప్రత్తిపాడుకు కందా వీరాస్వామి, ఏలేశ్వరానికి రెడ్డి లోవరాజు, ఏలేశ్వరం రూరల్‌కు ఏనుగు ధర్మరాజు, శంఖవరంకు ఎ.వరహాలును బీజేపీ ఇన్‌చార్జులుగా ప్రకటించారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి


తునిలో డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

ప్రత్తిపాడు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రత్తిపాడు పాత్రికేయులు తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. జర్నలిస్టుల డిమాండ్స్ డే పురస్కరించుకుని మంగళవారం ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. తహశీల్దార్ సూర్యప్రభ దృష్టికి పలు సమస్యలను తీసుకెళ్ళారు. కార్యక్రమంలో పలువురు స్థానిక జర్నలిస్టులు పాల్గొన్నారు.

జగ్గంపేట, (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ ఇచ్చిన పిలుపు మేరకు జగ్గంపేటలో తహశీల్దార్ కార్యాలయం వద్ద జర్నలిస్టులు నిరసన చేపట్టారు. డిప్యూటీ తహశీల్దార్ నాగేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జర్నలిస్టులు పాల్గొన్నారు.

గండేపల్లి (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల డిమాండ్ డే సందర్భంగా ఏపీడబ్ల్యూజే జర్నలిస్టుల సంఘం ఆధ్వర్యంలో తహశీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

కిర్లంపూడి, (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీడబ్ల్యూజే ఆధ్వర్యంలో కిర్లంపూడిలో జర్నలిస్టులు నిరసన తెలిపారు. తహశీల్దార్ చిరంజీవికి డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

తునిరూరల్, (ఆంధ్రజ్యోతి): తునిలో తహశీల్దార్ కార్యాలయం వద్ద పలువురు జర్నలిస్టులు నిరసన తెలిపారు. అనంతరం వారు డిప్యూటీ తహశీల్దార్ ప్రదీప్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఏపీయుడబ్ల్యూజే కాకినాడ జిల్లా కార్యదర్శి దేవవరపు కృష్ణార్జునరావు, పాత్రికేయులు డీఎస్ఎస్ ప్రభాకర్, పోలమరశెట్టి మధు, అద్దాల నానాజీ, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ అనుబంధ విభాగాల కమిటీల ఏర్పాటు

జగ్గంపేట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక రావులమ్మనగర్‌లోని టీడీపీ కార్యాలయంలో మండల అనుబంధ విభాగాల కమిటీల ఏర్పాటు చేశారు. గండేపల్లి వైస్ ఎంపీపీ కుంచే రాజా పరిశీలకులుగా, తెలుగుదేశం పార్టీ 11 అనుబంధ కమిటీలను ఏర్పాటు చేశారు. తెలుగు యువత అధ్యక్షుడిగా ఆర్.సాయి, తెలుగు మహిళ అధ్యక్షురాలుగా నకిరేడ్డి సూర్యావతి, తెలుగు రైతు అధ్యక్షుడిగా దాట్ల సూరిబాబు రాజు, బీసీ సెల్ అధ్యక్షుడిగా నంగన శ్రీనివాసరావు, ఎస్సీసెల్ అధ్యక్షుడిగా సాంబర్ల చంద్రశేఖర్, మైనార్టీ విభాగం అధ్యక్షుడిగా షేక్ బాషా, ఐటీడీపీ అధ్యక్షుడిగా కూసి మంచి బాలరాజు, క్రిస్టియన్ విభాగం అధ్యక్షుడిగా వేయి రామకృష్ణ, వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా మానేపల్లి సాయి, డాక్టర్స్ విభాగం అధ్యక్షుడిగా తిరుపతి మారుతి, సాంస్కృతిక విభాగం అధ్యక్షుడిగా మాగాపు శ్రీను, ఎస్టీసెల్ అధ్యక్షుడిగా మానేపల్లి సుబ్రహ్మణ్యం నియమితులయ్యారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు జీను మణిబాబు, ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్త కొండబాబు, దేవరపల్లి మూర్తి, సొసైటీ ఛైర్మన్లు బుర్రి సత్తిబాబు, ఉప్పలపాటి వెంకటేశ్వరరావు, రేఖ బుల్లి రాజు, మునిరెడ్డి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పీ-4ను వేగవంతం చేయాలి

గండేపల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీ -4ను వేగవంతం చేయాలని మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. పీ-4 ద్వారా నిరుపేద కుటుంబాలను దత్తత తీసుకునేలా గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. నిర్మాణాల్లో ఉన్న హౌసింగ్ గృహాలను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంపీడీవో కె.చంద్రరావు మాట్లాడుతూ మండలంలో సుమారు 230 కుటుంబాలను దత్తత తీసుకోవడం జరిగిందని, ఇంకా దత్తత తీసుకునేలా అవగాహన కల్పిస్తున్నామన్నారు. సమావేశంలో తహశీల్దార్, సిబ్బంది తదితరులు ఉన్నారు.